




# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 275 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 26 జూన్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-




## తుంగభద్ర ప్రాజెక్టు

# కొత్త గేట్లు ప్రారంభోత్సవం

### హాజరైన ముగ్గురు సీఎంలు

**బళ్లారి, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనతో రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు. మూడు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**జల వివాదాలను పరిష్కరించుకుందాం: సీఎం రేవంత్‌రెడ్డి**

తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. "తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నా. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే మిగతా .. 2లో..



# వెనిజులాలో భూకంపం విధ్వంసం..

## శిథిలాల కింద వందలాది మంది..!

### 10 అంతస్తుల హోటల్.. శిథిలాల దిబ్బగా : 164కు చేరిన భూకంప మృతులు

**విశ్వం వాయిస్ న్యూస్ :** వందేళ్లలోనే ఎన్నడూ చూడని ప్రకృతి విపత్తుతో వెనెజువెలా దేశం అల్లాడిపోతోంది. వరుసగా రెండు శక్తిమంతమైన భూకంపాల ధాటికి అనేక భవనాలు నేలమట్టమై లక్షలాది మంది ప్రజలు వీధినపడ్డారు. కాగా.. ఈ భూకంపాలు సంభవించడానికి కొన్ని క్షణాల ముందు గూగుల్ పలు స్మార్ట్‌ఫోన్లకు దీని గురించి అలర్ట్‌లు పంపించినట్లు తాజాగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన కొన్ని స్క్రీన్‌షాట్లను నెటిజన్లు సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఈ అలర్ట్‌లు వచ్చినట్లు సమాచారం. ఆ తర్వాత కాసేపటికే భూకంపాలు సంభవించాయి. ఇంతకీ గూగుల్ వీటిని ఎలా గుర్తించిందంటే..?

**యాక్సిలరోమీటర్‌తో..**

అధునాతన స్మార్ట్‌ఫోన్లలో యాక్సిలరోమీటర్ అనే పరికరం ఉంది. సాధారణంగా ఇది ఒక సెన్సార్. మీరు ఫోన్‌ను అడ్డంగా పట్టుకున్నప్పుడు స్క్రీన్‌ను ఆటోమేటిక్‌గా తిప్పుతుంది. అయితే, దీని వల్ల మరో ఉపయోగం కూడా ఉంది. ఈ సెన్సార్ కంపనాలను కూడా గుర్తించి కొలవగలదు. మనం ఉంటున్న ప్రాంతంలో భూమి నుంచి వెలువడే వైబ్రేషన్స్‌ను ఇది సేకరిస్తుంది. ఇవి భూకంపానికి దారితీసేంత బలంగా ఉంటే.. వెంటనే గూగుల్ ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్‌కు సిగ్నల్ పంపిస్తుంది. సుమారుగా ఏ ప్రాంతంలో భూకంపం వచ్చే అవకాశం ఉందో కూడా చెబుతుంది. ఒక స్మార్ట్‌ఫోన్ నుంచి ఈ సిగ్నల్ అందిన వెంటనే.. గూగుల్ సర్వర్ ఆ ప్రాంతంలోని మిగతా ఫోన్లలోని యాక్సిలరోమీటర్లను పరిశీలిస్తుంది. అత్యధిక ఫోన్లు ఇలాంటి ప్రకంపనలే గుర్తిస్తే.. వెంటనే భూకంపం మిగతా .. 2లో..

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో

# 2.27 కిలోల బంగారం పట్టివేత



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** శంషాబాద్ విమానాశ్రయం లో కస్టమ్స్ అధికారులు భారీగా బంగారాన్ని పట్టుకున్నారు. విదేశాల నుంచి వచ్చిన ప్రయాణికుడి నుంచి 2.27 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.3.36 కోట్లు ఉంటుందని అధికారులు చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై

# మంత్రి నారా లోకేష్ దృష్టి

### అధికారులకు కీలక ఆదేశాలు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు, అభ్యసన ఫలితాలపై ఈ విద్యా సంవత్సరం ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల విద్యాశాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖకు సంబంధించిన పలు కీలక వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు సుమారు మిగతా .. 2లో..

## కూటమి పాలనలో

# డ్వాక్రా మహిళలకు అన్యాయం

రుణాలపై వడ్డీ రాయితీ హామీని విస్మరించడం వల్ల మహిళలకు రూ.6 వేల కోట్లు నష్టం
వైసీపీ హయాంలో వడ్డీ రాయితీ కింద రూ.4,969 కోట్లు చెల్లించామని వెల్లడి
ప్రస్తుత పథకాన్ని కూడా ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మాజీ సీఎం వైఎస్ జగన్ విమర్శ



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏపీలోని కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు గురువారం ట్విట్టర్ వేదికగా ఆయన స్పందించారు. డ్వాక్రా మహిళలకు రుణాలు అందిస్తే వారికి ఆర్థిక స్వావలంబన కలగడమే కాకుండా, ఉత్పాదక రంగాల్లో పెట్టుబడులు పెట్టే అవకాశం మిగతా .. 2లో..

# పాస్‌పోర్ట్ ఫీజుల పెంపు



**విశ్వం వాయిస్ న్యూస్ :** పాస్‌పోర్ట్ ఫీజులను కేంద్ర ప్రభుత్వం సవరించింది. 36 పేజీలతో కూడిన పాస్‌పోర్ట్ రుసుమును రూ.1500 నుంచి రూ.2,500 పెంచింది. తత్కాల్ ఫీజును రూ.3,500 నుంచి రూ.5 వేలకు పెంచింది. 60 పేజీల పాస్‌పోర్ట్‌కు ప్రస్తుతం రూ.2వేలు వసూలు చేస్తుండగా ఇక నుంచి రూ.3500 వసూలు చేయనున్నారు. అదే తత్కాల్ ఫీజును రూ.6వేలుగా నిర్ణయించారు. 18ఏళ్ల కన్నా తక్కువ వయసున్న దరఖాస్తుదారులకు కొత్త పాస్‌పోర్ట్ రుసుము ప్రస్తుతం రూ.1000 ఉండగా.. దీనిని రూ.1750కి పెంచారు. సవరించిన ఫీజులు జులై 1 నుంచి అమలులోకి రానున్నట్లు మిగతా .. 2లో..

## సాయికృష్ణ హత్య వెనుక

# కూటమి కీలక నేతల ఒత్తిళ్లు

### వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు



**విశ్వం వాయిస్ న్యూస్ :** సాయికృష్ణ లాకప్ డెత్ కేసు ఏపీలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన వెనుక అధికార కూటమికి చెందిన కీలక నేతల 'ల్యాండ్ మాఫియా' ఒత్తిళ్లు ఉన్నాయంటూ వైసీపీ సీనియర్ నేత, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో పోలీసులు పూర్తిగా చంద్రబాబు ప్రైవేటు సైన్యంలా మారిపోయారంటూ ఆయన చేసిన ఆరోపణలు ఇప్పుడు పోలీస్ హౌసింగ్ అండ్ లీగల్ సర్కిల్స్‌లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. జగ్గయ్యపేట పరిధిలోని ఒక భారీ ల్యాండ్ డీల్ వివాదంలో కూటమికి చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యే, ఒక ఎంపీ పోలీసులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. వారి ఆదేశాల మేరకే సిటీ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ డైరెక్షన్‌లో... సీఐ నాగరాజు మరికొందరు మిగతా .. 2లో..

## ఇంటి భోజనం, ప్రత్యేక బెడ్..

# అనంతబాబు పిటిషన్లపై 29న తీర్పు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడు, వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు ప్రస్తుతం రాజమండ్రి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే. ఆయన దాఖలు చేసిన పలు పిటిషన్లపై విచారణ జరిపిన రాజమండ్రి ప్రత్యేక న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. జైల్లో తనకు ఇంటి భోజనంతో పాటు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలనే పిటిషన్, అలాగే సాక్షులను బెదిరించిన కేసులో బెయిల్ పిటిషన్‌పై కోర్టులో ఇరుపక్షాల లాయర్లు గట్టిగా వాదించుకున్నారు. వెన్నుపూస, మెడ సంబంధిత తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నందున తనకు జైలు వెలుపలి నుండి ఇంటి భోజనం,స్పెషల్ మెడికల్ బెడ్ సదుపాయాలు కావాలని అనంతబాబు కోర్టును కోరారు. కోర్టు ఆదేశాల మేరకు వైద్య పరీక్షల నివేదికలను జైలు అధికారులు న్యాయమూర్తికి సమర్పించారు. అయితే, అనంతబాబుకు ఉన్న గ్యాస్ట్రిక్ సమస్యలపై ఒక 'గ్యాస్ట్రో ఎంట్రాలజీ' నిపుణుడితో కూడా టెస్టులు మిగతా .. 2లో..

# 2028 నాటికి ఫస్ట్ ఫేజ్ పూర్తి

### అమరావతి బసవతారకం ఆసుపత్రి సైట్‌లో బాలకృష్ణ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరావతిలో బసవతారకం ఇండో-అమెరికన్ ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆసుపత్రి పనులను హిందూపూర్ ఎమ్మెల్యే, ఆసుపత్రి చైర్మన్ బాలకృష్ణ ఈరోజు క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించారు. సైట్ ఇంజనీర్లతో కలిసి ల్యాండ్ మ్యాప్స్, కన్‌స్ట్రక్షన్ డిజైన్లను రివ్యూ చేసిన బాలయ్య.. ఆసుపత్రి టైమ్‌లైన్‌కు సంబంధించిన మిగతా .. 2లో..




## బంగ్లాదేశ్ పర్యాటకులకు

# భారత్ గ్రీన్ సిగ్నల్



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగ్లాదేశీయులు భారత్‌లో పర్యటించేందుకు వీలుగా పర్యాటక వీసా సేవలను పునరుద్ధరిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. దీంతో దాదాపు రెండేళ్లుగా నిలిచిపోయిన వీసా జారీ ప్రక్రియ మళ్లీ ప్రారంభం కానుంది. బంగ్లాదేశ్‌లో భారత్ హైకమిషనర్‌గా ఉన్న దినేశ్ త్రివేదికి క్యాబినెట్ హోదా కల్పిస్తూ గురువారం కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత కాసేపటికి బంగ్లాదేశ్ అధ్యక్షుడిని కలిసిన త్రివేది.. కొన్ని పత్రాలను ఆయనకు సమర్పించారు. అక్కడి నుంచి నేరుగా మిగతా .. 2లో..

## వైకాపా కాపులను పావులుగా

# వాడుకుంటోంది

### భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ కాపులకు సముచిత గౌరవం ఇస్తూ రాజకీయంగా అవకాశాలు ఇస్తుంటే.. వైకాపా మాత్రం కాపులను పావులుగా వాడుకుంటోందని మిగతా .. 2లో..

## చంపినవాడు కాపు..

# చనిపోయివాడు కాపు అని మాట్లాడుతున్నారు

### వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ సాయికృష్ణ అదృశ్యం వ్యవహారం ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టిస్తోంది. ఈ అంశంపై వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కూటమి ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "సాయికృష్ణ లాకప్ డెత్ ఇష్యూ నుంచి తప్పించుకోవడానికి చంద్రబాబు ఏకంగా మిగతా .. 2లో..

# అక్షరం సాక్షిగా.. రాజ్యాంగ హత్య జరుగుతోందా?

ఈ దేశంలో ప్రతి పాఠశాలలో రాజ్యాంగం బోధిస్తారు. ప్రతి కళాశాలలో పౌరశాస్త్రం చెబుతారు. ప్రతి పరీక్షలో హక్కులు, విధులు రాయిస్తారు. అయినా ఈ దేశం ఎందుకు అవినీతిలో కూరుకుపోయి ఉంది? ఎందుకు అన్యాయం వీధుల్లో నగ్నంగా నడుస్తోంది? ఎందుకు సాటి మనిషి కష్టానికి మన మనసులు చలించడం మానేశాయి? సమాధానం చాలా సరళంగా ఉంది మనం రాజ్యాంగాన్ని చదివాం, కానీ జీవించలేదు.జ్ఞానం అర్థవంతమైనది కాదు ఆచరణే అర్థవంతమైనది. బాబాసాహెబ్ అంబేద్కర్ గారు రాజ్యాంగాన్ని రాసినప్పుడు ఆయన కేవలం చట్టాల పుస్తకం రాయలేదు. ఆయన ఒక కలను నిర్మించారు సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే నాలుగు స్తంభాలపై నిలబడిన భారతదేశం అనే ఆలయాన్ని కట్టారు. ఆ ఆలయంలో మనం ప్రవేశించాం, కానీ దేవుణ్ని మోసగించాం. హక్కులు అడిగేవాళ్ళు లక్షలాది మంది ఉన్నారు. విధులు పాటించేవాళ్ళు వేలలో కూడా కనిపించడం లేదు. ఇదే ఈ దేశపు అతి పెద్ద విషాదం. ఇదే ఈ గణతంత్రపు అతి పెద్ద వైఫల్యం.రాజ్యాంగంలో ఆర్టికల్ 51ఎ పౌరులకు ఏం చెబుతోందో తెలుసా? అది మనకు మౌలిక విధులు విధిస్తోంది. దేశాన్ని ప్రేమించడం, సామాజిక సామరస్యాన్ని కాపాడడం, పర్యావరణాన్ని రక్షించడం, శాస్త్రీయ దృష్టికోణాన్ని అలవరచుకోవడం ఇవి కేవలం మాటలు కావు, ఇవి మన జీవన సంవిధానం కావాలి. కానీ మన గుండె మీద చేయి వేసుకుని నిజాయితీగా అడుగుదాం, మనం వీటిని ఆచరిస్తున్నామా? మన ఆలోచనలను మార్చుకుంటున్నామా? ఐదేళ్ళకొకసారి ఓటేసి, చేతులు దులుపుకుని నా బాధ్యత తీరిపోయింది అని ఇంటికి వెళ్ళిపోయేవాడు పౌరుడు కాదు అతడు కేవలం ఒక ప్రేక్షకుడు మాత్రమే. ప్రజాస్వామ్యం అనేది స్టేజీ మీద జరిగే నాటకం కాదు; అది నిరంతరం మనం ప్రతిరోజూ పాల్గొనే ఒక జీవన్మరణ సంగ్రామం.

నీ పక్కింటిలో ఒక వితంతువు న్యాయం కోసం అలమటిస్తోంది నీకు పట్టలేదు. నీ వీధిలో ఒక చిన్నారి బాల కార్మికుడిగా నిస్సహాయంగా చాకిరీ చేస్తున్నాడు నువ్వు కళ్ళు మూసుకున్నావు. నీ గ్రామంలో అవినీతి అధికారి నిరుపేదల నోటి మెతుకులు దొంగిలిస్తున్నాడు నువ్వు మౌనంగా ఉన్నావు. ఇది పౌర బాధ్యత అనిపించుకోదు ఇది అచ్చంగా పౌర వైఫల్యం.అంబేద్కర్ గారు ఎప్పుడో హెచ్చరించారు.రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ప్రజాస్వామ్యం పునాదిపై నిర్మించకపోతే అది నిలబడదు. ఆ మాటలు నేటికీ మన సమాజంలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ఎందుకంటే మనం రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును చాలా సులభంగా వినియోగించాం, కానీ తోటి సాటి మనిషి యొక్క మానవ హక్కును గౌరవించడం మాత్రం నేర్చుకోలేకపోయాం.ఈ దేశంలో ఒక అపాయకరమైన నమ్మకం వేళ్ళూనుకుంది చట్టం ఉంది కదా, అది తన పని చేసుకుంటుంది. నాకెందుకు? ఇది కేవలం అజ్ఞానం కాదు, ఇది నాగరిక పరిత్యాగం. ఇది సమాజంపై మనం చేసే ఘోరమైన విశ్వాసఘాతుకం.చట్టం అనేది ఒక ఆయుధం. ఆ ఆయుధాన్ని అందుకుని పోరాడే చేతులు చైతన్యవంతమైన పౌరులవే కావాలి. ఒక అన్యాయాన్ని కళ్ళారా చూసి కూడా నాకేం పట్టదు అని తలతిప్పుకున్న ప్రతిసారి, నువ్వు రాజ్యాంగాన్ని తీవ్రంగా అపమానిస్తున్నావు. ప్రతి మూడు సెకన్లకూ ఈ దేశంలో ఒక మహిళపై ఘోరమైన నేరం జరుగుతోందని జాతీయ నేర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి నాలుగు నిమిషాలకూ ఒక రైతు అప్పుల్లో కూరుకుపోయి బలవన్మరణానికి పాల్పడుతున్నాడని వ్యవసాయ నివేదికలు వెలువడుతున్నాయి. ఇవి కేవలం కాగితాల మీద ఉండే గణాంకాలు కావు ఇవి మన పౌర సమాజపు మనస్సాక్షిపై విసిరిన నిందలు.

రాజ్యాంగం ఆర్టికల్ 14 స్పష్టంగా చెబుతోంది.చట్టం ముందు అందరూ సమానం. కానీ ఈ సమానత్వం నేడు ఎక్కడ కనిపిస్తోంది? ఒక పేద మనిషి న్యాయస్థానం మెట్లు ఎక్కితే సంవత్సరాల తర్వాత కూడా అతనికి న్యాయం దొరకదు సరేకదా, జీవితమే ముగిసిపోతుంది. అదే ఒక ధనవంతుడు తనకున్న పలుకుబడితో న్యాయాన్ని కొనుగోలు చేస్తాడు. ఒక దళితుడు గుడి మెట్లెక్కితే నేటికీ అవమానం ఎదుర్కొంటాడు. ఒక ఆదివాసీ తన అడవి భూమి కోసం, హక్కుల కోసం పోరాడితే జైలు పాలవుతాడు.ఇదా సమానత్వమా? లేదు, ఇది ముమ్మాటికీ రాజ్యాంగ హత్య. కానీ ఈ దారుణమైన హత్యకు ఎవరు బాధ్యులు? నేతలా? అవినీతి అధికారులా? కుళ్ళిపోయిన వ్యవస్థలా? అవన్నీ ఉన్నాయి, నిజమే. కానీ అన్నిటికన్నా ముందు మన సమాజపు నిశ్శబ్దం, మన మౌనం దీనికి ప్రధాన బాధ్యత వహిస్తోంది. అన్యాయాన్ని చూసి మాట్లాడకుండా మౌనంగా ఉండే ప్రతి పౌరుడు ఆ అన్యాయానికి పరోక్షంగా సహకారి అవుతాడు. ఇది చాలా చేదు నిజం, కానీ ఇది అక్షర సత్యం.రాజ్యాంగం మనకు అద్భుతమైన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను ప్రసాదించింది. కానీ దురదృష్టవశాత్తూ నేడు ఆ స్వేచ్ఛను సామాజిక మాధ్యమాల్లో ద్వేషం వ్యాప్తి చేయడానికి వాడుతున్నారు. సమాజాన్ని కులమతాల పేరిట విభజించడానికి వాడుతున్నారు. అబద్ధపు వార్తలను, ట్రోలింగ్ సంస్కృతిని వ్యాపింపజేయడానికి వాడుతున్నారు. స్వేచ్ఛ అనేది ఎవరికీ నచ్చినట్లు ప్రవర్తించడానికి ఇచ్చిన అనర్హమైన లైసెన్స్ కాదు - అది ఒక బాధ్యతాయుత సామర్థ్యం. మీకు నిజాలు మాట్లాడే హక్కు ఉంది, కానీ తోటివారిని కించపరుస్తూ అబద్ధం మాట్లాడే హక్కు రాజ్యాంగం ఏనాడూ ఇవ్వలేదు. మీకు నచ్చిన ధర్మాన్ని నమ్మే హక్కు ఉంది, కానీ ఆ నమ్మకాన్ని సాటి మనిషి మీద బలవంతంగా రుద్దే హక్కు లేదు.సౌభ్రాతృత్వం అంటే కేవలం వేదికలెక్కి వసుధైక కుటుంబం అని గొప్పగా నినదించడం కాదు సాటి పౌరుడి పట్ల నిజమైన గౌరవం, సహానుభూతి, మానవీయత చూపించడం. ఆ మానవీయతను రాజ్యాంగం మన రక్తంలో ప్రవహింపజేయాలని కోరింది. కానీ మనం కృత్రిమ అవమానాలు, వర్గ విభేదాలు, మత విష వాయువులు ఆ పవిత్రమైన స్థానాన్ని ఆక్రమించనిచ్చాం.రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ పర్యావరణ పరిరక్షణను మన మౌలిక విధిగా నిర్ణయించింది. కానీ అభివృద్ధి పేరిట మనం ఏం చేస్తున్నాం? జీవనదులను ప్లాస్టిక్ చెత్తకుండీలుగా మార్చాం. అడవులను నరికి కడతేర్చాం. పీల్చే గాలిని విషతుల్యం చేశాం.దేశ రాజధాని గాలి ఒక గ్యాస్ చాంబర్‌గా మారింది. తెలుగు రాష్ట్రాల నదులు రసాయన నురగలు చిమ్ముతున్నాయి. హిమాలయాల హిమానీనదాలు కరిగిపోతున్నాయి. ఇవి ప్రకృతి వైపరీత్యాలు కావు ఇవి అచ్చంగా మానవ తప్పిదాలు. ఇవి పౌర నిర్లక్ష్యానికి పరాకాష్ఠ. రేపటి తరాలకు ఒక నిర్జీవమైన, పనికిరాని భూమిని వారసత్వంగా ఇవ్వడం ఏ రాజ్యాంగమూ అనుమతించదు. మన పిల్లలు ఒక రోజు మనల్ని నిలదీసి అడుగుతారు మీరు కళ్ళముందే ఇదంతా జరుగుతున్నప్పుడు ఎందుకు ఆపలేదు? అని. ఆ ప్రశ్నకు సమాధానం మన దగ్గర లేదు. ఎందుకంటే మనం బాధ్యత లేకుండా సుఖంగా నిద్రపోతున్నాం.పౌర బాధ్యత అంటే ఏమిటో తెలుసా? అది ఒక విప్లవ సభలో పెద్ద పెట్టున నినదించడం కాదు. అది మన రోజువారీ జీవితంలో తీసుకునే చిన్న చిన్న నిర్ణయాలు.నీ పిల్లలకు ఇంట్లోనే జాతి, మత, కుల వివక్ష నేర్పకపోవడం అది పౌర బాధ్యత. రహదారిపై ప్రమాదానికి గురై గాయపడిన వ్యక్తిని చూసి తలతిప్పుకోకుండా ఆసుపత్రికి చేర్చి సహాయం చేయడం అది పౌర బాధ్యత. ఒక చిన్న పని కోసం అవినీతి అధికారికి లంచం ఇవ్వడానికి ఖచ్చితంగా నిరాకరించడం అది పౌర బాధ్యత. మీ చుట్టూ ఉన్న సమాజంలో మీ కోసం మాట్లాడలేని బలహీనుల కోసం గొంతు విప్పడం అది పౌర బాధ్యత. ఒక అబద్ధపు వార్తను, పుకారును వాట్సాప్‌లో ఫార్వర్డ్ చేయకముందు దాని నిజానిజాలు తెలుసుకోవడం అది పౌర బాధ్యత.ఇవేవీ ప్రపంచాన్ని మార్చేసే పెద్ద పెద్ద విప్లవాలు కావు. ఇవి చాలా సూక్ష్మ నిర్ణయాలు. కానీ ఈ సూక్ష్మ నిర్ణయాల సమష్టి రూపం మాత్రమే రేపు దేశంలో మహా మార్పుకు దారి తీస్తుంది.భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘమైన, సమగ్రమైన అద్భుత రాజ్యాంగాల్లో ఒకటి. దీనికి 75 సంవత్సరాలు పైగా నిండాయి. కానీ రాజ్యాంగం జయంతి నాడో, గణతంత్ర దినోత్సవం నాడో ఊరేగింపులు చేయడం, మైకుల ముందు గొప్ప ప్రసంగాలు చేయడం, మరుసటి రోజు నుండి మళ్ళీ యథాతథ స్థితికి తిరిగి వెళ్ళిపోవడం ఇది ఉత్సవం అనిపించుకోదు, రాజ్యాంగాన్ని ఉపహాసం చేయడమే అవుతుంది.రాజ్యాంగం మనకు అమూల్యమైన హక్కులు ఇచ్చింది. అయితే ఆ హక్కులను సమాజంలో సజీవంగా ఉంచే బాధ్యత మనదే. రాజ్యాంగం మనకు ఒక అద్భుతమైన మార్గదర్శినిగా నిలిచింది. ఆ ఆశలను నిజం చేసే కర్తవ్యం మనదే. రాజ్యాంగం మనకు ఒక విశాలమైన దృష్టిని ఇచ్చింది. ఆ దృష్టితో మన జీవితాలను, మన సమాజాన్ని, మన చుట్టూ ఉన్న వ్యవస్థలను మార్చుకునే శ్రమ మనదే కావాలి.ఈ దేశాన్ని నిర్మించేది కేవలం సిమెంట్‌తో, ఇటుకలతో, రాళ్ళతో కాదు మేల్కొన్న పౌరులతో. సంకెళ్ళు తెంచుకున్న పౌర స్పృహతో. అన్యాయంపై తిరగబడే ఆగ్రహంతో. సాటి మనిషిపై చూపించే నిస్వార్థమైన ప్రేమతో. కాబట్టి నేటి నుంచి ఒక దృఢమైన నిర్ణయం తీసుకోండి రాజ్యాంగాన్ని కేవలం చదివే తాత్కాలిక పౌరుడిగా కాదు, దానిని అక్షరాలా ఆచరించే పౌరుడిగా జీవించండి. ఎందుకంటే రాజ్యాంగం కేవలం చదివినవాడు ఉత్తమ పౌరుడు కాలేడు. దానిని నిత్య జీవితంలో ఆచరించిన వాడే నిజమైన పౌరుడు, దేశభక్తుడు.



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,
9490754169

(మొదటిపేజీ తరువాయి)

## కొత్త గేట్లు ప్రారంభోత్సవం

వాడుకోగలుగుతున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు. రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాను. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలను తీరుస్తుంది" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**నదుల అనుసంధానంతో గుజరాత్‌లో సమృద్ధిగా జలాలు: సీఆర్ పాటిల్**

ప్రస్తుత డ్యామ్‌లు ఆధునిక సాంకేతికతతో రూపొందుతున్నాయని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అన్నారు. 73 ఏళ్ల క్రితం మట్టితో నిర్మించిన తుంగభద్ర ప్రాజెక్టు ఇప్పటికీ బాగుందని చెప్పారు. "ఈ ప్రాజెక్టులో ఒక్క గేటు కొట్టుకుపోవడం వల్ల అన్ని గేట్లూ మార్చాల్సిన పరిస్థితి వచ్చింది. నర్మద, సరోవర్ జలాలు మిళితం చేసి నదుల అనుసంధానం చేపట్టాం. ఈ ప్రక్రియతో గుజరాత్‌లో నదీజలాలు సమృద్ధిగా ఉన్నాయి. రూ.లక్ష కోట్లతో రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో 3 నదులు అనుసంధానం చేపట్టాం" అని సీఆర్ పాటిల్ అన్నారు.

## పాస్‌పోర్ట్ ఫీజుల పెంపు

విదేశాంగశాఖ వెల్లడించింది.

**పాస్‌పోర్ట్ కూడా గుర్తింపు పత్రమే - ఈసీ**

పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వాన్ని నిర్ధరించే పత్రం కాదని కేంద్ర ప్రభుత్వం పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల సంఘం అధికారులు స్పందించారు. దేశంలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో చెల్లుబాటయ్యే 12 గుర్తింపు పత్రాల్లో పాస్‌పోర్ట్ కూడా ఒకటని స్పష్టం చేశారు. ఇటీవల బిహార్, అస్సాం రాష్ట్రాల్లో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలోనూ పాస్‌పోర్టు ఓ గుర్తింపు పత్రంగా ఉందని, అందులో ఎటువంటి మార్పు లేదన్నారు.

## మంత్రి నారా లోకేష్ దృష్టి

1,06,000 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని మొత్తం 7,620 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3,515 పాఠశాలలు (46.13 శాతం) ప్రస్తుతం పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయని వారు వివరించారు. విద్యా రంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వల్లే ఈ సానుకూల మార్పు చోటుచేసుకుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణ అంశంపై కూడా ప్రధానంగా చర్చించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించి ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, నివేదిక సమర్పించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. మరోవైపు, సెప్టెంబర్ 5 నుంచి మొదటి విడత కింద 175 'లీప్' పాఠశాలల్లో 9, 10 తరగతుల విద్యార్థుల కోసం 'ఏఐ ట్యూటర్' విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఈ విధానాన్ని 'క్లిక్కర్స్'కు అనుసంధానించాలని మంత్రి అధికారులకు సూచించారు. అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, విశాఖపట్నంలో డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీ, మంగళగిరిలో స్కిల్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. వచ్చే నెలలో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు అన్యాయం

ఉంటుందని జగన్ పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో స్వయం సహాయక గ్రూపు రుణాలపై వడ్డీ రాయితీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చి, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందని జగన్ విమర్శించారు. ఈ హామీని అమలు చేయకపోవడం వల్ల మహిళలు ఏటా రూ.3 వేల కోట్ల చొప్పున రెండేళ్లకు రూ.6 వేల కోట్ల ప్రయోజనాన్ని కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ హయాంలో డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ కింద రూ.4,969 కోట్లు చెల్లించామని, ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా ఆర్థికంగా అండగా నిలిచామని జగన్ గుర్తుచేశారు. పెంచిన రుణ పరిమితి సంగతి అటుంచి, ప్రస్తుతం ఉన్న వడ్డీ రాయితీ పథకానికి కూడా మద్దతు ఇవ్వకుండా కూటమి సర్కార్ నిర్వీర్యం చేసిందని ఆయన మండిపడ్డారు.

## కూటమి కీలక నేతల ఒత్తిళ్లు

సిబ్బంది కలిసి సాయికృష్ణను అదుపులోకి తీసుకుని అతి కిరాతకంగా హింసించి చంపేశారని అన్నారు. సాయికృష్ణపై రెండు నాన్ బెయిలబుల్ వారెంట్లు ఉన్న మాట వాస్తవమేనని... అయితే టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కృష్ణలంక పోలీసులు కలిసి థర్డ్ డిగ్రీ ఉపయోగించి ప్లాన్ ప్రకారం చంపారని రాచమల్లు ఆరోపించారు. "ఈ హత్యకు ఎలాంటి సాక్ష్యాలు దొరకకూడదని పోలీస్ స్టేషన్లలో ఎక్కడా కూడా సీసీటీవీ ఫుటేజ్ లేకుండా పూర్తిగా మాయం చేశారు. ఇప్పుడు కోర్టుకు ఇచ్చిన రిమాండ్ రిపోర్టులో సాయికృష్ణ ఎన్ని గంటలకు చనిపోయాడు? అసలు ఎప్పుడు చనిపోయాడు? అనే కనీస వివరాలు రాయలేదు. ఆ రిపోర్టు చూస్తుంటే చంపిన పోలీసులే స్వయంగా కూర్చుని రాసుకున్నట్లు ఉంది" అని రాచమల్లు లైవ్ కౌంటర్ ఇచ్చారు. ప్రజా సంఘాలు, వైసీపీ కలిసి గట్టిగా ఒత్తిడి తేవడం వల్లే గత్యంతరం లేక సీఐ నాగరాజుపై కేసు పెట్టారని... కానీ, ఈ ప్లాన్ వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారులైన ఐపీఎస్ అధికారులు, రాజకీయ నాయకులపై ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఈ కేసులో నిజాలు బయటకు రావాలంటే తక్షణమే విచారణను సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

## అనంతబాబు పిటిషన్లపై 29న తీర్పు

చేయించాలని కోర్టు ఆదేశించింది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆ స్పెషలిస్ట్ లేరని అధికారులు చెప్పడంతో... పూర్తి మెడికల్ రిపోర్ట్ వచ్చాకే ఇంటి భోజనం, ప్రత్యేక సదుపాయాలపై నిర్ణయం తీసుకుంటామని జడ్జి స్పష్టం చేశారు. ఇదే సమయంలో, సాక్షులను బెదిరించారనే కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ అనంతబాబు వేసిన మరో పిటిషన్‌పై ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాళ్ల సుబ్బారావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "అనంతబాబుకు పాత నేరచరిత్ర ఉంది. ఇప్పుడు ఆయనకు బెయిల్ మంజూరు చేస్తే బయట ఉన్న సాక్షుల భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లుతుంది. అధికార బలం, అంగబలంతో కేసు విచారణకు ఆటంకం కలిగించే అవకాశం ఉంది" అని పీపీ వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం... అనంతబాబు బెయిల్ పిటిషన్‌తో పాటు జైల్లో ఇంటి భోజనం, ప్రత్యేక సదుపాయాల కల్పన పిటిషన్‌పై ఈ నెల 29న ఒకేసారి తీర్పు వెలువరిస్తామని ప్రకటించింది.

## 2028 నాటికి ఫస్ట్ ఫేజ్ పూర్తి

కీలక విషయాలను వెల్లడించారు. అమరావతిలో క్యాన్సర్ పేషెంట్లకు వరంగా మారబోతున్న ఈ మెగా ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రస్తుతం చాలా వేగంగా సాగుతున్నాయని బాలకృష్ణ తెలిపారు. వచ్చే నెల పుట్టింగ్ పనులు మొదలవుతాయని చెప్పారు. హాస్పిటల్ బిల్డింగ్ నిర్మాణాన్ని అనుకున్న సమయానికి పూర్తి చేసేందుకు వర్కర్లు పగలూ రాత్రి షిఫ్టుల్లో కష్టపడుతున్నారని తెలిపారు. అయితే, వర్షాకాలం కారణంగా పనులు కొంత నెమ్మదించే అవకాశం ఉందని చెప్పారు. హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రిని మరింత విస్తరిస్తున్నామని... అదే క్రమంలో ఏపీ రాజధానిలోనూ అధునాతన వైద్యం అందించడమే తమ లక్ష్యమని బాలయ్య స్పష్టం చేశారు. అమరావతి ప్రాజెక్టుకు సంబంధించి 2028 నాటికి మొదటి దశ నిర్మాణ పనులు పూర్తై, రోగులకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా, కేవలం క్యాన్సర్ బాధితులకు ప్రపంచ స్థాయి సేవ చేయాలనే ఏకైక పవిత్ర ధ్యేయంతోనే ఈ ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు ప్రకటించారు.

## వైకాపా కాపులను పావులుగా వాడుకుంటోంది

భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు ధ్వజమెత్తారు. జగన్ పాలనలో కాపులకు ఏమేర న్యాయం జరిగిందో.. ఎంత గౌరవం దక్కిందో అందరికీ తెలుసని చురకలంటించారు. ప్రతి రాజకీయ అవసరానికి కాపులను వాడుకునే సంప్రదాయాన్ని మానుకోవాలని వీర్రాజు సూచించారు. వైకాపా కాపు నేతలకు ఆ విషయం తెలిసినా.. తెలియనట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు.

## భారత్ గ్రీన్ సిగ్నల్

ఇండియన్ వీసా అప్లికేషన్ సెంటర్ (ఐవీఏసీ)కి చేరుకొని వీసా జారీ ప్రక్రియను పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు. పర్యాటకులు జూన్ 28 నుంచి వీసాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల ఆందోళనలను హింసాత్మకంగా మారడంతో 2024 ఆగస్టులో అప్పటి బంగ్లా ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి పారిపోయి.. భారత్‌లో ఆశ్రయం పొందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరుదేశాల సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో తారిక్ రెహ్మాన్ నేతృత్వంలో బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత మళ్లీ ఇరుదేశాల సంబంధాలు క్రమంగా గాడిన పడుతున్నాయి. బంగ్లా నుంచి భారత్ పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. 2024లో సుమారు 17.5 లక్షల మంది భారత్ సందర్శనకు వచ్చినట్లు రికార్డులు చెబుతున్నాయి. అంటే సరాసరి రోజుకు 6000 వీసాలు జారీ అయ్యాయి. షేక్ హసీనా హయాంలో 11 ఐవీఏసీలు పని చేసేవి, అయితే, ప్రస్తుతానికి 5 కేంద్రాలల్లో వీసా జారీ ప్రక్రియ ఉంటుందని త్రివేది ప్రకటించారు. క్రమంగా వీటిని పెంచుకుంటూ వెళ్తామన్నారు.

## చనిపోయివాడు కాపు అని మాట్లాడుతున్నారు

కుల రాజకీయాలను తెరపైకి తెస్తున్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా.. చనిపోయిన వాడు కాపు, చంపినవాడు కాపు అని సీఎం స్థాయి వ్యక్తి కులాలను ప్రస్తావిస్తూ మాట్లాడటం అత్యంత దారుణం. ప్రభుత్వం చేసిన హత్యను డైవర్ట్ చేయడానికి చంద్రబాబు కుల ముద్ర వేసి రాజకీయం చేయాలని చూస్తున్నారు" అని మండిపడ్డారు. ఈ కేసు కేవలం ఒక సీఐ చేసిన చర్యగా చూపించి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం చూస్తోందని గుడివాడ ఆరోపించారు. "ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్య. హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేసే వరకు సాయికృష్ణ చనిపోయిన విషయాన్ని దాచారు. ఈ కేసులో కేవలం కింది స్థాయి పోలీసులను కాకుండా... డీజీపీ, డీజీ, ఏసీపీలను కూడా వెంటనే అరెస్ట్ చేయాలి. ప్రభుత్వం వేసిన సిట్ విచారణ వల్ల వాస్తవాలు బయటకు రావు. దీనిపై వెంటనే సీబీఐ దర్యాప్తు జరిపించాలి" అని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు కూడా ఆయన హెచ్చరికలు జారీ చేశారు. "పోలీసులు చట్టానికి లోబడి పని చేయండి. రేపటి రోజున మిమ్మల్ని కాపాడేందుకు చంద్రబాబు, లోకేశ్ రారు. కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటింది. ఇక మిగిలిన కాలంలో సినిమా దద్దరిల్లిపోతుంది. ఇది పాత కాలం కాదు, ఇంటర్నెట్ యుగం. వైసీపీ ముందు చంద్రబాబు డ్రామాలు అస్సలు చెల్లవు. హోంశాఖ సరిగా పనిచేయడం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణే స్వయంగా ఒప్పుకున్నారు" అని గుర్తు చేశారు. కాపుల సమస్యలపై సమావేశం పెట్టుకుంటే దాన్ని పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

## వెనిజులాలో భూకంపం విధ్వంసం..

వస్తుందని అంచనా వేసి ఆ ప్రాంతానికి అలర్ట్స్ పంపిస్తుంది. ఈ ప్రక్రియ శరవేగంగా జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 200 కోట్ల ఆండ్రాయిడ్ ఫోన్లలో ఈ ఫీచర్ ఉన్నట్లు గూగుల్ తెలిపింది.

**భూకంపం రావడానికి ముందే..**

సాధారణంగా భూకంపం అనేది ఒక్కసారిగా వచ్చే కుదుపు కాదు. తరంగాల రూపంలో సంభవిస్తుంది. తొలుత ప్రైమరీ వేవ్స్ వస్తాయి. ఇవి సెకనుకు ఆరు కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఆ తర్వాత సెకండరీ వేవ్స్ వస్తాయి. ఇవి సెకనుకు 3-4 కిలోమీటర్ల వేగంతో పయనిస్తాయి. భూకంపం వల్ల జరిగే అత్యధిక నష్టానికి ఈ తరంగాలే కారణం. ఇక, మన స్మార్ట్‌ఫోన్లు గుర్తించేవి ప్రైమరీ వేవ్స్‌నే. ఇవి రాగానే సర్వర్‌కు సిగ్నల్ ఇస్తాయి. అందువల్ల.. సెకండరీ వేవ్స్ రావడానికి ముందే గూగుల్ సర్వర్లు సమాచారాన్ని సేకరించి అలర్ట్ ఇవ్వడానికి సమయం లభిస్తుందని టెక్ నిపుణులు పేర్కొంటున్నారు.

**రెండు రకాల అలర్ట్‌లు..**

భూకంప తీవ్రతను అంచనా వేసినదాని బట్టి.. ఆండ్రాయిడ్ ఫోన్లు రెండు రకాల అలర్ట్‌లు ఇస్తుంటాయి. ఒకటి 'బి అవేర్ అలర్ట్'. ఇది తక్కువ తీవ్రతతో ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నప్పుడు ఇచ్చే సిగ్నల్. ఇక రెండోది 'టేక్ యాక్షన్ అలర్ట్'. మధ్యస్త, తీవ్ర స్థాయి భూకంపాల సమయంలో దీనిని జారీ చేస్తుంటుంది. దీన్ని టచ్ చేయగా.. భూకంపం వచ్చే అవకాశం ఉన్న పరిధిని చూపిస్తుంది. దీంతో పాటు విపత్తు సమయంలో సురక్షితంగా ఎలా బయటపడాలో తెలిపే కొన్ని సూచనలు చేస్తుంది.

**భారత్‌లోనూ..**

మన దేశంలోనూ 2023 నుంచి ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్ యాక్టివ్‌లో ఉంది. ఆండ్రాయిడ్ 5 అంతకంటే ఆధునిక వెర్షన్లలో ఈ ఫీచర్ ఉంది. అయితే, అలర్ట్‌లు రావాలంటే తప్పనిసరిగా ఫోన్‌లో మొబైల్ డేటా లేదా వైఫై ఆన్ చేసి ఉండాలి. ఒకవేళ ఈ అలర్ట్‌లు వద్దనుకునేవారు.. డివైజ్ సెట్టింగ్స్‌లో ఎర్త్‌క్వేక్/ఎమర్జెన్సీ అలర్ట్స్‌ను ఆఫ్ చేసుకోవచ్చు.

10 అంతస్తుల హోటల్.. శిథిలాల దిబ్బగా: 164కు పెరిగిన భూకంప మృతులు

వెనెజువెలాలో వరుస భూకంపాలు సృష్టించిన విలయం అంతా ఇంతా కాదు. ఈ విపత్తు ధాటికి ఆ దేశం అతలాకుతలమైంది. ప్రాణనష్టం కూడా భారీగానే ఉంది. ముఖ్యంగా తీర నగరమైన 'లా గువైరా' అయితే ఇప్పుడు మరుభూమిని తలపిస్తోంది. అక్కడ ఎటు చూసినా ధ్వంసమైన భవనాల వరుసలే కన్పిస్తున్నాయి. ఇక, ఈ నగరంలోని ప్రముఖ హోటల్ ఒకటి శిథిలాల దిబ్బలా మారింది. లా గువైరాలోని మకుటో ప్రాంతంలోని 'హోటల్ ఎడ్వర్డ్' ఎంతో ఫేమస్. ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉండే ఈ 10 అంతస్తుల భవనం.. బీచ్‌వ్యూతో ఆహ్లాదకరంగా ఉండేది. ఇక్కడ పార్టీలు, సమావేశాలు ఎక్కువగా జరుగుతుంటాయి. తాజాగా సంభవించిన భూకంపం ధాటికి ఈ భవనం పేకమేడలా కూలిపోయింది. కేవలం హోటల్ బేస్‌మెంట్ మాత్రమే మిగిలి గుర్తుపట్టలేని విధంగా ధ్వంసమైంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అయితే, భూకంపం సమయంలో ఈ హోటల్‌లో ఎంతమంది ఉన్నారు.. వారి పరిస్థితి ఏంటన్నది తెలియరాలేదు. వెనెజువెలా బేస్‌బాస్ స్టార్ ఆటగాళ్లకు చెందిన కుటుంబసభ్యులు ఈ హోటల్ శిథిలాల కింద చిక్కుకున్నట్లు సమాచారం.

**డిజాస్టర్ జోన్‌గా..**

కేవలం క్షణాల వ్యవధిలో సంభవించిన భారీ భూకంపాల ప్రభావంతో వెనెజువెలా రాజధాని కరాకస్‌తో పాటు పలు నగరాలు చిన్నాభిన్నమయ్యాయి. ఇందులో అత్యధికంగా ప్రభావితమైంది 'లా గువైరా'నే అని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. దీన్ని 'డిజాస్టర్ జోన్'గా ప్రకటించారు. ఇక్కడ పరిస్థితి అత్యంత విషాదకరం అని ఆమె విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఇప్పటివరకు 30 సార్లు భూప్రకంపనలు సంభవించాయి.

**164 మంది మృతి..**

మరోవైపు, ఈ విపత్తు కారణంగా మరణించిన వారి సంఖ్య 164కు పెరిగింది. 971 మంది గాయపడినట్లు రోడ్రిగ్జ్ వెల్లడించారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, శిథిలాల కింద చిక్కుకున్నవారిని గుర్తించి ఆసుపత్రులకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక, విపత్తు వేళ వెనెజువెలాకు సాయం అందించేందుకు పలు దేశాలు ముందుకొస్తున్నాయి. జర్మనీ సైనిక రవాణా విమానాలను పంపిస్తామని చెప్పింది. ఎమర్జెన్సీ సాయం చేస్తామని స్పెయిన్ తెలిపింది.

# ఎడిటర్ వాయిస్

## ఆరోగ్యమే మహాభాగ్యం.. నివారణే ఉత్తమ వైద్యం

మనిషి జీవితంలో సంపదలు, పదవులు, ఆస్తులు ఎంత ఉన్నా ఆరోగ్యం లేకపోతే అవన్నీ వ్యర్థమే. అందుకే పెద్దలు "ఆరోగ్యమే మహాభాగ్యం" అని చెప్పారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యంపై నిర్లక్ష్యం పెరుగుతోంది. అదే అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది.

మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవడం, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, కాలుష్యం వంటి కారణాలతో మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, ఊబకాయం వంటి వ్యాధులు చిన్న వయస్సులోనే కనిపిస్తున్నాయి. ఒకప్పుడు వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులు నేడు యువతను కూడా వేధిస్తున్నాయి.

ప్రభుత్వాలు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య పథకాలు అమలు చేస్తున్నాయి. అయితే చికిత్స కంటే నివారణకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, పరిశుభ్రమైన పరిసరాలు, సమయానికి వైద్య పరీక్షలు వంటి అంశాలను అలవాటు చేసుకోవాలి.

అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు మరింత మెరుగుపడాలి. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావాలి. పేదలకు వైద్యం భారంగా మారకుండా ప్రభుత్వాలు మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలి.

ప్రజలు కూడా సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వైద్య సలహాలను నమ్మకుండా, అర్హత కలిగిన వైద్యుల సూచనల మేరకే చికిత్స పొందాలి. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చిన్న సమస్యను కూడా పెద్ద ప్రమాదంగా మార్చే అవకాశం ఉంది.

ఆరోగ్యవంతమైన సమాజమే అభివృద్ధి చెందిన దేశానికి పునాది. ప్రతి వ్యక్తి తన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాదు, కుటుంబం మరియు సమాజం పట్ల కూడా ఒక బాధ్యత. ఆరోగ్యాన్ని అలవాట్లతో కాపాడుకోవాలి... ఆసుపత్రులతో కాదు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## పక్కా స్కెచ్.. ఏటీఎం డబ్బుతో పరారైంది తండ్రీకొడుకులే



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని పాతబస్తీలో ఏటీఎం సొమ్ముతో డ్రైవర్ పరారైన ఘటనలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. కుమారుడితో కలిసి డ్రైవర్ శ్రీనివాస్ ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఐఎస్ సదన్ పీఎస్ పరిధిలో ఈ చోరీ జరిగిన విషయం తెలిసిందే. ముందస్తు ప్రణాళికతోనే రూ.17లక్షల నగదు చోరీ చేసి తండ్రీకొడుకులు బైక్‌పై పరారైనట్లు తేల్చారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు. ఉప్పుగూడలోని మరో కుమారుడికి శ్రీనివాస్ కొంత నగదు అందించినట్లు గుర్తించారు. కొద్దినెలల క్రితమే ఏటీఎంలలో నగదు అమర్చే ఏజెన్సీ సంస్థలో శ్రీనివాస్ డ్రైవర్‌గా చేరాడు. అప్పుల బాధతో చోరీకి పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. జగిత్యాల సమీపంలో అత్తగారి ఇంటి వద్ద నిందితుడిని పట్టుకున్నట్లు సమాచారం. శ్రీనివాస్‌తో పాటు ఇద్దరు కుమారులనూ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. నగదు రికవరీ, కుట్రపై దర్యాప్తు కొనసాగుతోంది. త్వరలో పోలీసు అధికారులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించే అవకాశముంది.

**ఏం జరిగిందంటే..**

ఐఎస్ సదన్ పరిధిలో డబ్బు అమర్చే ప్రైవేటు ఏజెన్సీ సిబ్బంది కలీం అనే వ్యక్తి పర్యవేక్షణలో రూ.30లక్షల నగదున్న బ్యాగులతో 3 ఏటీఎంలలో డబ్బును అమర్చారు. ఈది బజార్ వికాస్ పాఠశాల ఎదురుగా ఏటీఎంలో అమర్చేందుకు ఏజెన్సీ సిబ్బంది ఏటీఎం గదిలోకి వెళ్లారు. వాహనంలో డ్రైవర్ శ్రీనివాస్ మాత్రమే ఉన్నాడు. దీంతో అతడు రూ.17 లక్షలున్న బ్యాగ్‌ను తీసుకుని బైక్‌పై పరారయ్యాడు. విషయం తెలిసిన వెంటనే కలీం ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. నిఘా కెమెరాల్లో దృశ్యాలు, నిందితుడి కాల్ లిస్టు పరిశీలించారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో కుమారుడితో కలిసి శ్రీనివాస్ బైక్‌పై పక్కా ప్రణాళికతో పరారైనట్లు గుర్తించారు.

ముక్కునోరు మూసి..పసిగుడ్డును చిదిమేసి..

## తల్లి అయిన ఇంటర్ విద్యార్థిని దురాగతం

### ఊపిరాడక నవజాత శిశువు మృతి.. మూడో అంతస్తు నుంచి విసిరివేత

### గోల్కొండలోని మైనారిటీ వసతిగృహంలో దారుణం

**గోల్కొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంటర్ చదువుతున్న విద్యార్థిని తెలిసీతెలియని వయసులో గర్భం దాల్చింది. విషయాన్ని గుట్టుగా ఉంచి... హాస్టల్‌లోనే బిడ్డను ప్రసవించింది. తర్వాత పసికందు ముక్కు, నోరు మూసేసి చేజేతులా ఊపిరి తీసింది. హైదరాబాద్ గోల్కొండలోని మైనారిటీ వసతిగృహంలో చోటుచేసుకున్న ఈ దారుణ సంఘటన వివరాలిలా ఉన్నాయి... హైదరాబాద్ జగద్గిరిగుట్టకు చెందిన విద్యార్థిని(18) ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతోంది. లారీడ్రైవర్‌గా పనిచేసే తన మేనబావతో మూడేళ్లుగా సన్నిహితంగా ఉంటూ.. శారీరకంగా దగ్గరయ్యారు. కొద్దినెలల క్రితమే తాను గర్భం దాల్చినట్లు మేనబావకు చెప్పింది. బొప్పాయి తింటే గర్భస్రావం అవుతుందని అతడు చెప్పడంతో.. అలానే చేసింది. అయినా.. గర్భం పోలేదు. ఈ హాస్టల్‌లో విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించే మెడికల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉండటంతో విద్యార్థిని గర్భం దాల్చిన విషయం వెలుగులోకి రాలేదు. సోమవారం వేకువజామున ఆమెకు ప్రసవ నొప్పులు మొదలయ్యాయి.

**మృతదేహాన్ని ఈఎస్ఐ డిస్పెన్సరీలోకి విసిరేసి...**

ప్రసవ నొప్పులు తీవ్రం కావడంతో హాస్టల్‌లోని బాత్రూమ్‌లోకి వెళ్లింది. అక్కడే మగశిశువుకు జన్మనిచ్చింది. పుట్టిన బిడ్డ ఏడుపులు ఎక్కడ వినిపిస్తాయోననే భయంతో శిశువు ముక్కు, నోరు మూసింది. దీంతో ఊపిరాడక పసికందు ప్రాణం పోయింది. అనంతరం మృతదేహాన్ని వసతిగృహం మూడో అంతస్తు నుంచి పక్కనే ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీలోకి విసిరేసింది. మంగళవారం ఉదయం ప్రిన్సిపల్ శిశువు మృతదేహాన్ని గమనించి గోల్కొండ పోలీసులకు సమాచారమిచ్చారు. టోలిచౌకి ఏసీపీ సయ్యద్ ఫియాజ్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు ఘటనా స్థలానికి చేరుకుని.. నవజాత శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం సీసీటీవీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. వసతిగృహం మూడో అంతస్తు గోడపై రక్తపు మరకలు, బాత్రూమ్‌లో మాయ, రక్తపు మరకలను గుర్తించారు. సదరు విద్యార్థినిపై అనుమానం వచ్చి ప్రశ్నించటంతో విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే ఆమెను నిలోఫర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గర్భానికి కారకుడైన మేనబావ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## భర్త గొంతు నులిమి చంపిన భార్య

**తిమ్మాజిపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పొలం అమ్మకం విషయంలో జరుగుతున్న గొడవల కారణంగా ఓ భార్య.. భర్త గొంతు నులిమి హత్య చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు.. తిమ్మాజిపేట మండలం ఆవంచకు చెందిన అమ్మపల్లి యాదయ్య (57)కు భార్య అలివేలు, కుమార్తె పద్మ, అల్లుడు ఆంజనేయులుకు పొలం అమ్మకం విషయంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పడుకున్న చోటే యాదయ్య మృతి చెందాడని భార్య ఇరుగుపొరుగువారితో పాటు మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లిలో ఉండే అల్లుడు, కుమార్తెకు చెప్పింది. బుధవారం మధ్యాహ్నం అంత్యక్రియలకు సిద్ధమైన సమయంలో మృతదేహానికి స్నానం చేయిస్తుండగా శరీరంపై గాయాలున్నట్టు బంధువులు గుర్తించి అలివేలును నిలదీశారు. దీంతో తానే హత్య చేసినట్టు ఆమె ఒప్పుకొంది. హత్యలో అల్లుడు, కుమార్తెల హస్తం కూడా ఉన్నట్లు యాదయ్య అన్న కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ప్రాణం తీసిన 'తలుపు' గొడవ

### ముంబయి లోకల్ రైలులో దారుణం





**ముంబయి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇద్దరు ప్రయాణికుల మధ్య తలెత్తిన చిన్న గొడవ ముంబయి లోకల్ రైలులో ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. అంధేరి - బోరీవలీ స్టేషన్ల మధ్య మంగళవారం రాత్రి ఈ దారుణం జరిగింది. బయట భారీ వర్షం కురుస్తుండగా రైలు తలుపులు తెరిచి ఉంచాలని ఒకరు.. మూయాలని మరొకరు వాగ్వాదానికి దిగారు. ఇద్దరి మధ్య గొడవ పెద్దదై తన బ్యాగులో నుంచి కత్తి తీసిన సచిన్ రమేశ్ సువర్ణ (30) ప్రయాణికులు అందరూ చూస్తుండగా మయాంక్ లోహర్ (22) అనే యువకుడిపై దాడికి దిగాడు. ఛాతీపై, పొట్టపై పలుమార్లు కత్తితో పొడవటంతో మయాంక్ రైలులోనే కుప్పకూలిపోయాడు. కత్తి చూపుతూ వీరంగం సృష్టించిన నిందితుడు బోరీవలీ స్టేషను వస్తుందనగా కిందికి దూకి పరారయ్యాడు. మయాంక్‌ను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. 400 సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

## కోల్‌కతాలో గిడ్డంగి కూలి.. ఐదుగురి మృతి

### గోదాము కూలిన ప్రాంతంలో సహాయక చర్యలు



**కోల్‌కతా, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని తారాతలా ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం నిర్మాణంలో ఉన్న మూడంతస్తుల గిడ్డంగి కూలడంతో ఐదుగురు మృతి చెందారు. పలువురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నారు. 20 మందిని బయటకు తీసి సమీప ఆసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళాలు ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిర్మాణంలో భారీ ఇనుప స్తంభాలను వాడటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన సీఎం సువేందు అధికారి.. గిడ్డంగి భవన నిర్మాణంలో లోపాలు న్నాయని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని అసెంబ్లీలో గురువారం ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు.

అధికారులకు 200 బాంబు

## బెదిరింపు మెయిళ్లు పంపిన మహిళ అరెస్టు

**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశవ్యాప్తంగా ఉన్న పలు ప్రభుత్వ సంస్థలు, అధికారులు, ఇతర ఉన్నత స్థాయి సంస్థలకు 200లకుపైగా నకిలీ బాంబు బెదిరింపు ఈ-మెయిళ్లు పంపిన ఆరోపణలపై సీమా లోహుమీ (41) అనే మహిళను అరెస్టు చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. ఫిబ్రవరి నుంచి వచ్చిన వరుస బెదిరింపు ఈ మెయిళ్లపై జరిపిన సాంకేతిక దర్యాప్తు అనంతరం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన సీమను ఈ నెల 21న అరెస్టు చేశామని వారు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ- మెయిళ్లలో ప్రముఖ ప్రదేశాల్లో బాంబులు పెట్టారనే తప్పుడు వాదనలు, ఈవీఎంలకు సంబంధించిన ఆరోపణలు, అవినీతి ఫిర్యాదులు వంటివి ఉన్నాయి. సీమ ఈ నెల 9 నుంచి దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ వ్యక్తులు, సంస్థల్ని లక్ష్యంగా చేసుకుని ఈ-మెయిళ్లను పంపుతోంది. వీటి ఆధారంగా గురుద్వారా సమీపంలో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. పలు ఆరోగ్య సమస్యల కారణంగా నిందితురాలు చాలాకాలంగా చికిత్స తీసుకుంటున్నట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

## డయాబెటిస్ రోగులు చేపలు తినొచ్చా..?

### ఇలా చేస్తే దెబ్బకు షుగర్ కంట్రోల్..






ప్రస్తుత కాలంలో చాలామంది డయాబెటిస్ (మధుమేహం)తో బాధపడుతున్నారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా లక్షలాది మంది దీనితో పోరాడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో డయాబెటిస్ ఉన్నవారు చేపలు తినవచ్చా అనే సందేహం చాలామందిలో ఉంటుంది. దీనిపై వైద్య నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకుందాం.. ప్రస్తుత కాలంలో చాలామంది డయాబెటిస్ (మధుమేహం) తో బాధపడుతున్నారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా లక్షలాది మంది దీనితో పోరాడుతున్నారు. డయాబెటిస్ అనేది రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా ఉండే దీర్ఘకాలిక వ్యాధి.. ఇది శరీరానికి సరిపడినంత ఇన్సులిన్ ఉత్పత్తి కానప్పుడు లేదా ఉన్న ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించుకోలేనప్పుడు వస్తుంది. ముఖ్యంగా డయాబెటిస్ ఉన్న వారు తీసుకునే ఆహారం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మందికి పలు సందేహాలు వస్తుంటాయి.. డయాబెటిస్ ఉన్నవారు చేపలు తినవచ్చా అనే ప్రశ్న తరచుగా ఉత్పన్నమవుతుంది. అయితే.. దీనిపై వైద్యులు ఫుల్ క్లారిటీ ఇస్తున్నారు. డయాబెటిస్ ఉన్నవారు చేపలు తినడంలో ఎటువంటి ఇబ్బంది లేదని, వాస్తవానికి ఇది లీన్ ప్రోటీన్ కు అద్భుతమైన మూలమని వైద్య నిపుణులు చెబుతున్నారు. చేపలలో విటమిన్ డి, ఐరన్ వంటి అనేక విలువైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు శరీరానికి చాలా అవసరం. కండరాల బలోపేతానికి చేపలు పనికివస్తాయని పేర్కొంటున్నారు.

**వండే విధానం..**

అయితే.. చేపలను వండే విధానం వాటి పోషక విలువలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అధిక ఉష్ణోగ్రత వద్ద వండటం వల్ల చేపలలోని విటమిన్లు, ఖనిజాలు నశించే అవకాశం ఉంది. దీనికి విరుద్ధంగా, కుండలో తక్కువ మంటపై వండటం ఒక ఆరోగ్యకరమైన ప్రక్రియ. అలాగే.. చేపల కూరలో నూనె వాడకం గురించి కూడా జాగ్రత్త వహించాలి. సాధారణంగా చేపల కూర అంటే ఎక్కువ నూనె వాడుతుంటారు.. అయితే వీలైనంత తక్కువ నూనెతో వండటం అలవర్చుకోవాలి.

**మసాలాల ప్రభావం..**

చేపల పులుసులో వాడే మసాలాలకు కూడా కొన్ని పోషక విలువలు ఉంటాయి. కొన్ని మసాలాలకు యాంటీ-ఆక్సిడెంట్, యాంటీ-ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నందున అవి రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. అయితే, మసాలాలను, ముఖ్యంగా కారం, ఉప్పును, మితంగా వాడాలంటున్నారు. అధికంగా కారం వాడటం వల్ల ఎసిడిటీ, గ్యాస్ట్రైటిస్ వంటి జీర్ణ సమస్యలు తలెత్తవచ్చని హెచ్చరిస్తున్నారు వైద్య నిపుణులు.. ఏదైనా ఆహారాన్ని మితంగా తీసుకోవడం చాలా ముఖ్యం. డయాబెటిస్ ఉన్నవారు చేపలను సరైన పద్ధతిలో వండి, మితంగా తీసుకోవడం ద్వారా వాటి పూర్తి పోషక ప్రయోజనాలను పొందవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

## అరికాళ్ళపై షుగర్ దాడి..

### ఉస్మానియాలో ప్రత్యేక చికిత్స






డయాబెటిస్ వ్యాధి ప్రపంచ వ్యాప్తంగా చాపకింద నీరులా వ్యాపిస్తోంది. ప్రతి ఇంట్లో మధుమే వ్యాధిగ్రస్తులు ఉంటున్నారు. అయితే ఇప్పుడు ఈ వ్యాధి అరికాళ్లపై ప్రభావం చూపుతోంది. దీంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. అలాగే.. షుగర్ ఉన్న చాలామందికి అసలు తెలియకుండానే కాళ్లలో ప్రమాదం మొదలవుతోంది. నొప్పి లేదు.. మంట లేదు.. కానీ లోపల నాడులు క్రమంగా పనిచేయడం మానేస్తున్నాయి. ఇదే డయాబెటిక్ న్యూరోపతి. ఈ సమస్యను గుర్తించడంలో ఆలస్యం అయితే చిన్న గాయం కూడా పెద్ద ముప్పుగా మారుతోంది. కొన్నిసార్లు అది కాళ్లు కోల్పోయే స్థాయికి తీసుకెళ్తోంది. షుగర్ ఎక్కువకాలంగా ఉన్నవారిలో నాడీ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఎక్కువ. ముఖ్యంగా పాదాల్లో స్పర్శ తగ్గిపోతుంది. కాలికి గాయం అయినా నొప్పి తెలియదు. రక్త ప్రసరణ సరిగా లేక గాయం మానడానికి సమయం పడుతుంది. అదే సమయంలో ఇన్‌ఫెక్షన్ శరీరంలోకి చొచ్చుకుపోయే అవకాశాలు పెరుగుతాయి. పరిస్థితి చేయి దాటితే ప్రాణాలు కాపాడేందుకు కాలును తొలగించాల్సిన పరిస్థితి కూడా ఎదురవుతోంది. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో ఉస్మానియా ఆసుపత్రి మధుమేహ బాధితులకు కీలక సహాయంగా నిలుస్తోంది. ఆసుపత్రిలో పనిచేస్తున్న 'డయాబెటిక్ ఫుట్ కేర్ క్లినిక్'లో పాదాలకు సంబంధించిన సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి చికిత్స అందిస్తున్నారు. ప్రతిరోజూ వందల సంఖ్యలో రోగులు ఈ క్లినిక్‌కు వస్తుండగా, ఎక్కువ మంది 30 నుంచి 70 ఏళ్ల మధ్య వయసు వారే. మహిళలకంటే పురుషులే అధికంగా చికిత్స పొందుతున్నారు. కాళ్లలో అల్సర్లు, పుండ్లు, మానని గాయాలతో బాధపడుతూ వచ్చే రోగులను ముందుగా స్క్రీనింగ్ చేసి, న్యూరోపతి ఉందా లేదా అన్నది వైద్యులు నిర్ధారిస్తున్నారు. పరిస్థితిని బట్టి గాయాలకు చికిత్సలు చేయడంతో పాటు, మళ్లీ గాయాలు కాకుండా ప్రత్యేకంగా రూపొందించిన చెప్పులను కూడా అందిస్తున్నారు. పేద రోగులకు ఈ సేవలు పూర్తిగా ఉచితంగా లభిస్తున్నాయి.

గత రెండేళ్లలో దాదాపు రెండు వేల మంది డయాబెటిక్ న్యూరోపతి రోగులకు చికిత్సలు అందించామని, వారిలో 200 మందికి ప్రత్యేక చెప్పులు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. షుగర్ ఉన్నవారు కాళ్లను నిర్లక్ష్యం చేయకుండా ప్రతిరోజూ పరిశీలించుకోవడం, చిన్న సమస్య కనిపించినా వెంటనే ఆసుపత్రిని సంప్రదించడం ద్వారా పెద్ద ప్రమాదాలను తప్పించుకోవచ్చని డాక్టర్స్ సూచిస్తున్నారు. ఈ సేవలను టెలి కాల్ ద్వారా ముందే బుక్ చేసుకుని.. సమయం వృథా అవ్వకుండా చికిత్స పొందవచ్చు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...




కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శుక్రవారం, 26 జూన్, 2026




www.viswamvoice.com

### కాంగ్రెస్ నీచ సంస్కృతికి

# ప్రజాస్వామ్య హత్య దినోత్సవం తార్కాణం

## 2047 నాటికి ప్రపంచ అగ్రగామిగా భారత్ : ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్ హయాంలో ఆనాటి ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరాగాంధీ 25 జూన్ 1975 ప్రజాస్వామ్యాని ఖూనీ చేస్తూ ఎమర్జెన్సీని ప్రకటించడం కాంగ్రెస్ పార్టీ నీచ సంస్కృతికి తార్కాణమని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి తెలిపారు. గురువారం బూరుగుపూడి వికాస్ ఫార్మసీ కళాశాలలో అధినేత టివి నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాస్వామ్య హత్యదినోత్సవానికి ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఆనాడు ప్రజాస్వామ్య హత్యదినోత్సవంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన నేతలు వెంకటేశ్వరరావు తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన అనంతరం, స్వర్గీయ తన్నీరు చిన్న సుబ్బారావు మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో స్వర్గీయ ఇందిరాగాంధీ రాజ్యాంగ విలువలకు త్రిలోదకాలు వదిలి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, పత్రికల స్వేచ్ఛను హరించి, సుమారు పదివేల మంది ప్రతిపక్ష నాయకులను జైల్లో నెట్టి 21 నెలల పాటు సాగించిన రాక్షస పాలనను నేటి విద్యార్థులు,ప్రజలు గుర్తించుకోవాలన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ఎమర్జెన్సీ ప్రకటించవలసి వస్తే ముందుగా మంత్రిమండలిలో చర్చించి, అనంతరం భారత రాష్ట్రపతి ఆమోదంతో అమలు చేయాలని, కానీ ఆనాడు ఇందిరా గాంధీ రాజ్యాంగాని విస్మరించి, ప్రజాస్వామ్య విలువలను తుంగలోకి తొక్కారన్నారు. కాంగ్రెస్ దుర్మార్గపు పాలనను ప్రజలు ఆదరించరన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ మోదీ పాలనలో భారతదేశం 2047 నాటికి ప్రపంచ అగ్రగామిగా నిలుస్తుందండంలో అతిశయోక్తి లేదన్నారు. బిజెపి పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలని, దేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపించాలని మోదీ చేస్తున్న కృషి అద్వితీయమన్నారు. అంతరం నారాయణ ఆధ్వర్యంలో దగ్గుపాటి, సోము తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భరత్ వికాస్, ఏపీఆర్ చౌదరి, నీరుకొండ వీరన్న చౌదరి, గుర్రాల వెంకట్రావు, ఓలేటి సూర్యనారాయణ, ఉదయ భాస్కర్, ప్రిన్సిపాల్ సుమలత, అడపా సుధీర్, మద్దిపాటి రజిని, సూర్యనారాయణ, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్‌లో దిశా కమిటీ సమీక్షా సమావేశంలో పాల్గొన్న అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి

### రామచంద్రపురంలో ప్రజా దర్బార్

# వినతులు స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. రామచంద్రపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, సంక్షేమ మరియు మౌలిక సదుపాయాలకు సంబంధించిన 38 వినతిపత్రాలను సమర్పించారు. వచ్చిన ప్రతి అర్జీని స్వయంగా పరిశీలించిన మంత్రి, సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రజా ఫిర్యాదుల విభాగం ద్వారా అందిన ప్రతి అర్జీపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం రూరల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబుతో పాటు కూటమి పార్టీ నాయకులు, స్థానికులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

### విద్యార్థులకు న్యాయ నిపుణుల సూచన




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలోని శ్రీ కృత్తివేంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల లోక్ అదాలత్ చైర్మన్ బి.హెచ్.వి. లక్ష్మీకుమారి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయ నిపుణులు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. రామచంద్రపురం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, మండల లోక్ అదాలత్ ప్యానెల్ న్యాయవాది దొమ్మలపాటి సత్యనారాయణ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు మనిషి ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని, సమాజాన్ని పూర్తిగా నాశనం చేస్తాయని హెచ్చరించారు. సరదాగా లేదా స్నేహితుల ఒత్తిడితో మొదలయ్యే ఈ అలవాటు, చివరికి జీవితాన్ని చీకటిలోకి నెట్టేస్తుందని పేర్కొన్నారు. యువత వీటి బారిన పడితే వారి విద్య, ఆరోగ్యం, ఉజ్వల భవిష్యత్తు దెబ్బతింటాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మాదకద్రవ్యాల తయారీ, నిల్వ, అమ్మకం, రవాణా మరియు వినియోగంపై ఎన్.డి.పి.ఎస్ చట్టం-1985 ద్వారా కఠినమైన శిక్షలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే జీవిత ఖైదుతో పాటు, 20 సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్షలు పడే అవకాశం ఉందని కాబట్టి చట్టపరంగా, నైతికంగా విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్యానెల్ న్యాయవాది నందిక కళ్యాణి మాట్లాడుతూ మాదకద్రవ్యాలు క్షణిక కాలం మాత్రమే ఆనందాన్ని ఇస్తాయని, కానీ జీవితాంతం బాధలను మిగులుస్తాయని విద్యార్థులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు బి. సునీత్ కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు గుంతల్లో నీరు తొలగింపు



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన మండల కేంద్రమైన కాట్రేనికోనలోని మావుళ్ళమ్మ గుడి వద్ద నుండి నడవపల్లి వెళ్లే పంచాయతీరాజ్ రహదారికి గుంతలు పడడంతో వర్షం నీరు నిలిచిపోతుంది. దీంతో వాహనదారులు అంచనా తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై నలిగిపోయిన నడవపల్లి రోడ్డు అనే శీర్షిక న 24వ తేదీబుధవారం ప్రచురించిన వార్తకు ఎంపీడీవో బి. రాజేశ్వరరావు, పంచాయతీ అధికారులు సిబ్బంది స్పందించారు. గురువారం గుంతల్లోని నీటినిజెసిబి సహాయంతో మళ్లించారు. దీంతో వాహనదారులు తాత్కాలిక ఉపశమనం పొందారు. నడవపల్లి వరకు రోడ్డును ఆయన పరిశీలించారు. పంచాయితీ రాజ్ అధికారులతో మాట్లాడి గుంతల్లో గ్రావెల్ వేయించేలా ఏర్పాటు చేస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. పంచాయతీరాజ్ డిఇ వివరణఈ విషయమై స్పందించిన పంచాయతీరాజ్ డి. ఈ,పి.వి శ్రీనివాసరావు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డు పంచాయతీరాజ్ కి సంబంధించిందని, ఆర్ అండ్ బి కి బదిలీ కాలేదని, గతంలో ప్రపోజల్స్ చేయడం జరిగిందని చెప్పారు. పుష్కర నిధులు కింద రూ కోటి 40 లక్షలు అంచనాలు తయారు చేసి పంపించడం జరిగిందన్నారు. మంజూరు అయిన వెంటనే రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఈ రోడ్డు పునర్నిర్మానంపై ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు.

### రామచంద్రపురంలో వైభవంగా

# శ్రీ ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో శ్రీ ముత్యాలమ్మ జాతర, తీర్థ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జాతర కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తీన్మార్ డప్పులు, గరగల నృత్యాలు, చిన్నారుల సాంప్రదాయ కోలాటాలు మరియు బాణసంచా కాల్పులతో అమ్మవారి ఊరేగింపు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఘనంగా సాగింది. ఈ ఊరేగింపు శ్రీ ముత్యాలమ్మ ఆలయం నుంచి ప్రారంభమై, రైల్వే స్టేషన్, ఆర్టిసి కాంప్లెక్స్ మరియు మెయిన్ రోడ్డు మీదుగా రాజగోపాల్ సెంటర్ వరకు కొనసాగింది. ప్రతి ఇంటికి అమ్మవారి ఆశీర్వాదం అందేలా భక్తులు ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. మార్గమధ్యంలో భక్తులకు శీతల పానీయాలను పంపిణీ చేశారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 11 గంటల నుంచి ప్రారంభమైన ఈ అన్నదాన కార్యక్రమంలో రామచంద్రపురం పట్టణ మరియు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు తొగరు మూర్తి మాట్లాడుతూ 2007వ సంవత్సరం నుంచి ప్రతి ఏడాది ముత్యాలమ్మ తీర్థం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే, నియోజకవర్గంలోని విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ, సరస్వతి దేవి పూజలతో పాటు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మర్రి గణపతి, కొమరగిరి వెంకటరమణ, రెడ్డి కృష్ణ, మద్దెల అశోక్, నరసింహమూర్తి, తొగరు బ్రహ్మాజీ, నాగబాబు, అన్యం మధు, నాగమణి, లక్ష్మిలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### రామచంద్రపురంలో 45 మంది లబ్ధిదారులకు

# రూ. 32.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న 45 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 32.2 లక్షల విలువైన చెక్కులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మరియు జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు పేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోకుండా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని వివరించారు. కష్టకాలంలో ఉన్న బాధితులకు ఈ ఆర్థిక భరోసా ఎంతో ఊరటనిస్తుందని సామాజిక బాధ్యతతో కూడిన ప్రభుత్వ పాలనలో ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు చేరవేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో కూడా నియోజకవర్గంలో వైద్య సహాయం అవసరమైన వారికి ప్రాధాన్యత ఇస్తూ నిరంతరం అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న బాధితులకు ప్రభుత్వం ఆపన్నహస్తం అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా తమకు అందడంపై లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం రూరల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, కూటమి పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### సరికొత్త హంగులతో గోరక్షణ పేట

# బట్టల మూటల వర్తక సంఘం పున: ప్రారంభం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక గోరక్షణపేటలోని బట్టల మూటల వర్తక సంఘం సరికొత్త హంగులతో గురువారం సంఘ సభ్యులు పున: ప్రారంభించారు. గురువారం ఉదయం 10.44 నిమిషాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు శేశెట్టి వెంకటరావు, ప్రెసిడెంట్ అంకం మల్లేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ గోరు శ్రీనివాసరావు, కోశాధికారి బూడిద నూకరాజు, సెక్రటరీ నందం వీరవెంకట సత్యనారాయణ (చంటి), వైస్ సెక్రటరీ కాలెపు సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు గోరు ప్రకాష్, వత్స ఆనంద్, సూరిశెట్టి గౌరీశంకర్, చోడవరపు మారేష్, బాసిన సత్తిబాబు, బత్తి శివ, బాజింక సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



# అమలాపురంలో 1,500 మందితో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ జిల్లాలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జూన్ 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా నాయకత్వంలో అమలాపురం గోకుల్ సెంటర్ నుంచి గడియార స్తంభం వరకు ఈ ర్యాలీ సాగింది. ర్యాలీలో విద్యార్థులు, వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది, డీ-అడిక్షన్ సెంటర్ ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం గడియార స్తంభం వద్ద ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులు, యువత, ప్రజలకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ డ్రగ్స్ దుర్వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, ముఖ్యంగా గంజాయి వంటి మాదకద్రవ్యాలు శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల నేర ప్రవర్తన పెరగడంతో పాటు వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవితాలపై ప్రతికూల ప్రభావాలు పడతాయని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద నమోదయ్యే కేసుల్లో ఇరుక్కుంటే ఎదురయ్యే శిక్షలు, చట్టపరమైన పరిణామాల గురించి కూడా విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం కుటుంబాలను విచ్ఛిన్నం చేయడమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా అడ్డంకిగా మారుతుందని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కదలికలపై ఏదైనా సమాచారం ఉంటే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ, అమలాపురం డీఎస్పీ, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ, ఏఆర్ డీఎస్పీ, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఏరియా ఆసుపత్రి సైకియాట్రిస్ట్ డాక్టర్ సౌమ్యతో పాటు వైద్య సిబ్బంది, ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు, డీ-అడిక్షన్ సెంటర్ సిబ్బంది, పోలీసు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం సుమారు 1,500 మంది ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ మద్దతు ప్రకటించారు.

జిల్లా ఎస్పి రాహుల్ మీనా




# మాజీ మంత్రి గొల్లపల్లిని పరామర్శించిన మంత్రి సుభాష్

**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** పుత్ర వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యరావును రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి పరామర్శించారు. గొల్లపల్లి సూర్యారావు రెండవ కుమారుడు గొల్లపల్లి ప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కుమారుడి మృతితో తీవ్ర విషాదంలో ఉన్న మాజీ మంత్రి సూర్యరావును పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు మంత్రి సుభాష్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని గొల్లపల్లి ప్రసాద్ చిత్రపటానికి పుష్పాలువేసి నివాళులర్పించారు. గొల్లపల్లిని పరామర్శించి వారిలో మాజీ శాసనసభ్యులు చెల్లి వివేకనంద, గొలుగూరి వెంకటరెడ్డి, యస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కేతా శ్రీను జిల్లా తెదేపా ఉపాధ్యక్షులు తాడి నర్సింహరావు రాష్ట్ర తెదేపా హెచ్ ఆర్ డి సభ్యుడు దళిత రత్న నేదునూరి వీర్రాజు, ముమ్మిడివరం తెలుగురైతు అధ్యక్షులు యాళ్ళ ఉదయ్, పెన్మత్స కృష్ణవర్మ, తెదేపా సీనియర్ నాయకులు గుబ్బల మూర్తి, అచ్చిరెడ్డి, కోట వెంకటేశ్వరరావు చిట్టూరి నాగేశ్వరరావు తదితర కూటమి నాయకులు పరామర్శలో పాల్గొన్నారు.



# రైతులు పండ్ల తోటలను ప్రోత్సహించాలి

## ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతుల ఆదాయాన్ని పెంచడం, భూసారాన్ని పరిరక్షించడం, దీర్ఘకాలికంగా స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పండ్ల తోటల పెంపకానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వెల్లడించారు. మండపేట మండలం జెడ్. మేడపాడు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన పండ్ల మొక్కల నాటే కార్యక్రమాన్ని కొబ్బరి మొక్కలు నాటి ఆయన ప్రారంభించారు. అనంతరం రైతులకు 224 కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మామిడి, జామ, నిమ్మ, ఉసిరి, సీతాఫలం తదితర పండ్ల మొక్కల నాటకం, గుంతల తవ్వకం, నీటి సంరక్షణ పనులు, మొక్కల సంరక్షణ వంటి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించబడుతుందని తెలిపారు. అలాగే అర్హులైన చిన్న, సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భూముల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పండ్ల తోటల ఏర్పాటు వల్ల రైతులకు దీర్ఘకాలిక ఆదాయం లభించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో వైవిధ్యీకరణ ద్వారా రైతుల ఆర్థిక స్థితి మరింత మెరుగుపడుతుందని, భవిష్యత్ తరాలకు సుస్థిర వ్యవసాయ విధానాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కంచర్ల చంద్రశేఖర్, ఈదిపల్లి మంగరాజు, సంగిశెట్టి అమ్మన్న, అత్తిలి వెంకన్నబాబు, సంగిశెట్టి శేఖర్, కొట్టు జగపతి, వడ్డి వీరాస్వామి, ఈపిడీవో సత్యనారాయణ, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ఆర్ఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పి.గన్నవరం మండలం ఎమ్మెల్యే వారి క్యాంపు కార్యాలయం వద్ద సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది 32వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమమని తెలిపారు. ఈరోజు మొత్తం 62 మంది లబ్ధిదారులకు రూ. 34,14,835/- విలువైన చెక్కులను అందజేసినట్లు పేర్కొన్నారు. పేద ప్రజలు అనారోగ్య సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. అలాగే, "పవనన్న ఆరోగ్య భరోసా" కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో పేద ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం, అవసరమైన మందులు అందించడం, ఉచిత శస్త్రచికిత్సలు చేయించడం, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు అందించడం జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఏఎంసీ చైర్మన్, డైరెక్టర్లు, రాష్ట్ర డైరెక్టర్లు, నీటి సంఘ చైర్మన్లు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.




# పల్స్ పోలియోపై అవగాహన సదస్సు



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల 28 ఆదివారం నిర్వహించ బోయే పోలియోను జయప్రదం చేయాలని ఎంపీడీఓ బి.రాజేశ్వర్ రావు పిలుపునిచ్చారు. నిండు జీవితానికి రెండు చుక్కలు చిన్నారుల ఆరోగ్యకర భవిష్యత్తుకి భరోసా అని ఈ సందర్బంగా తెలిపారు. గురువారం కాట్రేనికోన, పల్లంకుర్రు వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి ఏఎన్ఎమ్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలు అందరికీ ఆదివారం నాడు నిర్వహించబోయే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత సమాజానికి ప్రతిఒక్కరు కంకణబద్ధులు కావాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ హితవుపలికారు. 28న నిర్వహించ బోయే పోలియో శిబిరాల యందు అంగన్వాడీ, ఏ ఎన్ ఎమ్, ఆశా కార్యకర్తలు పూర్తి బాధ్యతతో సమర్ధవంతంగా పని చేయాలని, అలసత్వం వహించరాదని ఎంపీడీఓ ఆదేశించారు. కార్యక్రమంలో కాట్రేనికోన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఎమ్ లిఖిత, మలేరియా సబ్ యూనిట్ అధికారి కె.రామ్మోహన్ రావు, సూపర్ వైసర్ జెవి రమణమ్మ, పబ్లిక్ హెల్త్ నర్స్ జి.రామశేషులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యావేత్త జనార్ధన్ రెడ్డి మృతి



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ విద్యావేత్త లక్ష్మీ భారతి కాన్వెంట్ వ్యవస్థాపకులు పెచ్చేటి లక్ష్మి జనార్ధన్ రెడ్డి (70) మాచవరంలో ఆయన స్వగృహం నందు బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు 1978 సంవత్సరంలో మాచవరంలో మొట్ట మొదటి విద్యాసంస్థ స్థాపించి వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. 48 ఏళ్లపాటు గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు ఫీజులతో సంబంధం లేకుండా విద్య నందించి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. ఆయన మృతికి సంతాపం తెలుపుతూ గురువారం అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. అన్ని స్కూల్స్ ఉపాధ్యాయులు ఆయనకి సంతాపం తెలిపారు.

### డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అడిషనల్

# ఎస్పీ (అడ్మిన్)గా మహేంద్ర మత్తే ఎపిపిఎస్ బాధ్యతల స్వీకరణ




**అమలాపురం క్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)గా మహేంద్ర మత్తే ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారి కంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ఎస్పీ రాహుల్ మీనాని మర్యాద పూర్వకంగా కలిసి, జిల్లాలోని శాంతిభద్రతల పరిరక్షణ మరియు నేర నియంత్రణ అంశాలపై చర్చించారు. అనంతరం అమలాపురం డీఎస్పీ టీ.ఆర్.యస్.కె ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ యస్.మురళీ మోహన్, మహిళ పి.యస్ డీఎస్పీ షేక్ షాబాజ్ అహ్మద్, డీఎస్పీ (ఏ ఆర్) సుబ్బరాజు, జిల్లా పోలీస్ కార్యాలయం అధికారులు, పలువురు ఆర్ఐలు, సీఐలు, ఎస్సైలు సిబ్బంది నూతన అడిషనల్ ఎస్పీని మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు.

# అంతర్జాతీయ మత్తు పదార్ధాల వ్యతిరేక దినోత్సవ అవగాహన



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామచంద్రపురంలో అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టిబాబు సూచనల మేరకు, ఈగల్ క్లబ్ కన్వీనర్ రవిబాబు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు పాల్గొని, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే తీవ్ర అనర్థాలను మరియు ఆరోగ్య సమస్యలను విద్యార్థులకు సవివరంగా వివరించారు. మత్తు పదార్థాల అలవాటు ఒక వ్యక్తి జీవితాన్ని, కుటుంబాన్ని ఏ విధంగా నాశనం చేస్తుందో ఆయన వివరించారు. ముఖ్యంగా యువత తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకునే అవకాశం ఉందని, శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. క్రీడలు, చదువు మరియు సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొంటూ మత్తుకు దూరంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు. అనంతరం, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె. శ్రీను, డాక్టర్ కె. శ్రీదేవి, సుదర్శన్ రావు, బరిల్లు, నూకరాజు, వీర్రాజులతో పాటు ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మత్తు పదార్థాల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు.

### ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు

# రాజకీయ పార్టీలు సహకరించాలి

## జిల్లా రెవెన్యూ అధికారి వి.సుబ్బారావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి వి. సుబ్బారావు కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్ఓ ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు కొత్తగా ఓటరులుగా నమోదు అయ్యేలా రాజకీయ పార్టీలు తమ వంతు ప్రోత్సాహాన్ని అందించాలని సూచించారు. ప్రతి రాజకీయ పార్టీ తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు బూత్ స్థాయి ఏజెంట్లను వెంటనే నియమించుకోవాలని, తద్వారా ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా సాగుతుందని తెలిపారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై నిఘా ఉంచాలని, పేర్ల సవరణ, తొలగింపు, చిరునామా మార్పులు వంటి అంశాలను బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించే సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన పలు సందేహాలకు డీఆర్ఓ సుబ్బారావు సమాధానాలు ఇచ్చారు. ఎన్యుమరేషన్ ప్రక్రియను మరింత పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. బోగస్ ఓట్ల తొలగింపు, అర్హులైన వారికి మాత్రమే ఓటు హక్కు ఉండేలా చూడటంలో ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున సంసాని చంద్రశేఖర్, భారతీయ జనతా పార్టీ తరఫున బి. రామవర్మ, ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ శివరాజ్, సిబ్బంది భరత్ తదితరులు హాజరయ్యారు.

### రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో

# ప్రతిభ కనబరిచిన అత్తిలి హర్ష మణికంఠ



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** పిఠాపురంలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికలో ఏడుగురు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్ర, నిర్వ హణ కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిఠాపురం ఆర్ఆర్బీహెచ్ఆర్ కళాశాల ప్రాంగణం వద్ద ఆది వారం సబ్ జూనియర్స్ బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. మొత్తం 55 మంది బాల, బాలికలు పాల్గొనగా, ఇద్దరు బాలికలు, ఐదుగురు బాలురను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 12 నుండి 14 వరకూ జరిగిన విజయనగరం పోటీల్లో పాల్గొంన్నారు అని తెలిపారు. దీనిలో భాగంగా కోనసీమ జిల్లా అమలాపురం నుండి సాయి స్కూల్ అఫ్ మార్షల్ ఆర్ట్స్ నుండి హర్ష మణికంఠ ప్రతిభ కన భరిచాడు అని సాయి మార్షల్ ఆర్ట్స్ ఫౌండర్ దేశంశెట్టి సాయిబాబు తెలియచేసారు. ఈ సందర్బం గా మాస్టర్ సాయి మాట్లాడుతూ కోనసీమ నుండి ఇంకా ఎన్నో పతకాలు మరియు స్పోర్ట్స్ కోటా లో పంపడానికి నేను ఎంత గానో కృషి చేస్తాను అని తెలిచేసారు.

# మలికిపురం ఎస్సై పి.సురేష్ కాకినాడకు బదిలీ



**మలికిపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం సబ్‌ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్సై పి. సురేష్ బదిలీపై కాకినాడకు వెళ్తున్నారు. ఆయన ఇక్కడ ప్రజలకు విశేష సేవలు అందించారు. మలికిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు చేస్తూ అందరూ మన్నెలు అందుకున్నారు. ఆయన సేవలకు స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, సహచర సిబ్బంది అభినందనలు తెలియజేశారు. బదిలీపై వెళుతున్న ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికి, కొత్త బాధ్యతల్లో కూడా విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

# ముమ్మిడివరంలో కారు ప్రమాదం

## ముగ్గురికి స్వల్ప గాయాలు



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం ప్రధాన రహదారిపై గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం, పెద్ద వంతెన సమీపంలో వేగంగా వెళ్తున్న కారు ఒక్కసారిగా అదుపుతప్పి రహదారి పక్కకు దూసుకువెళ్లిందని తెలిపారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి బాధితులను అంబులెన్స్‌లో సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ముమ్మిడివరం ఎస్సై జ్వాలసాగర్ ఆరా తీస్తున్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ జిల్లా ఎడిషన్

శుక్రవారం, 26 జూన్ 2026
www.viswamvoice.com





# సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## అధికారుల ఆదేశించిన జిల్లా కలెక్టర్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో ఈనెల 15 నుంచి చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026, సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ ప్రియతో కలిసి కాకినాడ పట్టణ నియోజకవర్గానికి సంబంధించి 34వ పోలింగ్ కేంద్రం భాస్కర్‌నగర్‌లో బీఎల్వోలు ఇంటింటా ఎన్యుమరేషన్ పంపిణీ ప్రక్రియను ఆకస్మాత్తుగా పరిశీలించారు. ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, పత్రాలు పూర్తి చేసి తిరిగి ఓటర్ల నుంచి స్వీకరించడంలో అనుసరిస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ నేరుగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని సర్పవరం వద్ద ఉన్న పనసపాడు గ్రామంలో 83, 84 పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న సర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్.. ట్రైనీ కలెక్టర్ ప్రియ, కాకినాడ రూరల్ ఈఆర్వో, ఆర్డీవో ఎస్.మల్లిబాబు తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో సర్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నాణ్యతతో చేపట్టాలన్నారు. ప్రాముఖ్యంగా చనిపోయిన, శాశ్వతంగా గ్రామాతరం వెళ్లిన, నాట్ ట్రేస్ అవుట్ వ్యక్తుల ఓట్ల విషయంలో అత్యంత అప్రమత్తతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ఎటువంటి అపోహలు, పొరపాట్లకు తాగు లేకుండా సర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. బీఎల్వోలు సర్ ప్రక్రియ పై ప్రత్యేక దృష్టి పెట్టి తప్పనిసరిగా నిర్దిష్ట గడువులోపు ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గానికి సంబంధించి 83, 89 పోలింగ్ బూత్ లలోని బీఎల్వోలు ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీలో వెనుకబడడం గమనించి వెంటనే ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం, అజాగ్రత్తగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎన్నికల సూపర్వైజర్లను జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ పరిశీలనలో భాగంగా సర్పవరం గ్రామంలో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉండడం గమనించిన జిల్లా కలెక్టర్.. పంచాయతీ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే మురుగు కాలవలు శుభ్రం చేసి, పారిశుద్ధ వ్యవస్థ పై ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లా కలెక్టర్.. పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల డీటీలు గోవింద్ ప్రసాదు, సునీల్, వివిధ పోలింగ్ బూత్‌ల బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

### ఈ నెల 27, 28తేదీల్లో

# ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు

## ఈఆర్వో కేటీ సుధాకర్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు ఈ నెల 27, 28 తేదీలలో ప్రత్యేక డిజిటలైజేషన్ క్యాంపెయిన్ డేస్ నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో) కేటీ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణకు సంబంధించిన సందేహాల నివృత్తికి కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం హాల్లో సూపర్వైజర్లు, బీఎల్‌వోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో ప్రస్తుతం 2025 ఓటరు జాబితాలో నమోదైన ఓటర్ల వివరాలను 2002 ఎన్నికల జాబితాతో అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఈ క్రమంలో బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటివరకు సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 27, 28 తేదీలను శని ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ డేస్‌గా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ రెండు రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉండి ఓటర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు ఓటరు జాబితా సవరణకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు నిర్దేశిత సమయంలో తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా సూపర్వైజరీ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అలాగే నగరంలోని ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను పరిశీలించుకోవడంతో పాటు తప్పుల్లేని ఓటరు జాబితా తయారీలో సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్‌వోలు), తహసీల్దార్ జితేంద్ర, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, డీటీ గోవిందరాజులు, సూపర్వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# ఘనంగా సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు జన్మదిన వేడుకలు





**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాలి కొండబాబు జన్మదిన సందర్భంగా గురువారం కాకినాడ సిటీ నగరం నుండి తెలుగుదేశం పార్టీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వనమడి కొండబాబు జన్మదిన సందర్భంగా ఎటిమోగ నందు అరదాడి శివ ఆధ్వర్యంలో రక్తదాన శివరాన్ని, నీలపల్లి కామరాజు ఆధ్వర్యంలో పేదలకు వస్త్రాలు పంపిణీ కార్యక్రమాన్ని వనమాడి మోహన్ వర్మ, మల్లిపూడి వీరు ప్రారంభించారు. అనంతరం తెలుగు యువత అధ్యక్షులు గడ్డం పూర్ణ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నందు అన్నదాన కార్యక్రమాన్ని, భానుగుడి సెంటర్ నందు ఎస్సీ సెల్ అధ్యక్షులు అంబటి సత్యనారాయణ (చిన్న) ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని, చిట్నేడి దారా ప్రసాద్ ఆధ్వర్యంలో కల్పనా సెంటర్ నందు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చోడిపిల్లి సతీష్ ఆధ్వర్యంలో బలుసు సాంబమూర్తి పాఠశాల నందు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రతాప్ నగర్ జనావళి స్వచ్ఛంద సేవా సంస్థ నందు వృద్ధులకు భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా వనమాడి మోహన్ వర్మ, మల్లిపూడి వీరు మాట్లాడుతూ కాకినాడ సిటీ శాసనసభ్యులు, విజినరి నాయకుడు వనమాడి కొండబాబు గారు జన్మదిన సందర్భంగా కాకినాడ నగరంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు కూటమి నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, తమ నాయకుడు వనమాడి కొండబాబు జన్మదిన వేడుకలకు దూరంగా ఉన్నప్పటికీ ప్రతి డివిజన్ నందు స్థానిక నాయకులు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ లు, స్వీట్స్ పంపిణీ వంటి కార్యక్రమాలతో కొండబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గదుల సాయిబాబా, పలివెల రవి అనంత కుమార్, ఎనిమిరెడ్డి మాలకొండయ్య, చింతలపూడి రవి, జొన్నాడ వెంకటరమణ, ఎం.విద్యాసాగర్, పల్లా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# దీక్ష చేపట్టిన పవన్ కల్యాణ్.. ఎప్పటి వరకంటే!



జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఆధ్యాత్మిక మార్గాన్ని అలవరచుకున్నారు. గత రెండేళ్లుగా ఆయన దీక్షలు చేపడుతున్నారు. జ్యేష్ఠ మాసంతో ప్రారంభమయ్యే ఈ దీక్ష.. ఏకండా 120 రోజులకుపైగానే కొనసాగుతుంది. అనంతరం కార్తీక మాసంలో దీనిని ముగిస్తారు. ఈ ఏడాది కూడా పవన్ కల్యాణ్ బుధవారం సాయంత్రం దీక్షా వస్త్రాలు ధరించి.. దీక్షను ప్రారంభించారు. అయితే.. ఈ విషయాన్ని పెద్దగా వెల్లడించకపోవడం గమనార్హం. బుధవారం ఉదయం మంగళగిరిలోని పానకాల లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వెళ్లిన డిప్యూటీ సీఎం.. ప్రత్యేక పూజలు చేశారు. అప్పటికే ఆయన దీక్షావస్త్రాలు ధరించారు. పూజల అనంతరం ధ్యానం చేసిన తర్వాత.. తిరిగి మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిలోనే ఈ దీక్షా సమయంలో పవన్ ఉండనున్నారు. ధ్యానం, పూజలు, మంత్ర పఠనం వంటివి ఈ కాలంలో ఎక్కువగా చేస్తారని జనసేన పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే.. పాలనకు సంబంధించిన ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. దీక్షా వస్త్రాల్లోనే ఉప ముఖ్యమంత్రిగా తన విధులు నిర్వర్తిస్తారని, ఎక్కువగా పర్యటనలకు వెళ్లకపోవచ్చని వెల్లడించాయి. ఈ దీక్షా కాలంలో పరిమి తంగా భేటీలు నిర్వహించే అవకాశం ఉంటుందని తెలిపాయి. అయితే.. అధికారిక విధులకు సంబంధించి ఎవరినైనా కలుస్తారని.. అంతకుమించి పార్టీ పరంగా కొంత విరామం తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఇక, దీక్షా సమయంలో పవన్ కల్యాణ్ కుటుంబానికి దూరంగా ఉండడంతోపాటు.. సాత్వికాహారమే తీసుకుంటారు. పాలు, పం డ్లు, ఉడికించిన కూరగాయలు వంటివి మితంగా తీసుకుంటారని ఆయన అనుచరులు తెలిపారు. వస్త్ర ధారణలోనూ జాగ్రత్తలు పాటించనున్నారు. ఎరుపు రంగు అంచుతో కూడిన చందన వర్ణ దుస్తులను ధరించనున్నారు. ప్రతిరోజూ దేవతారాధన, అనుష్ఠా నాలు, ధ్యానంలో నిమగ్నమవుతారు. ఈ దీక్షా సమయంలో గురుముఖత నేర్చుకున్న మంత్ర పఠనానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

# రైతు బజార్‌లో ఆక్రమణలపై కమిషనర్ కొరడా





**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రైతు బజార్లో డ్రైనేజీలు, రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలపై నగంపాలక సంస్థ అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్వివి సత్యనారాయణ రైతు బజార్లో స్వయంగా పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. పర్యటన సందర్భంగా మున్సిపల్ డ్రైనేజీలను ఆక్రమించి, రహదారిపైకి విస్తరించిన దుకాణాలను గుర్తించిన కమిషనర్ వెంటనే వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించే విధంగా ఆక్రమణలు కొనసాగుతున్న నేపథ్యంలో కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతు బజార్ నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన రైతు బజార్ స్టేట్ ఆఫీసర్‌పై కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సౌకర్యాలకు భంగం కలిగించే ఆక్రమణలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. రైతు బజార్ సమీపంలోని మసీదు, చర్చికి వెళ్లే మార్గంలో దుకాణాలు, వాహనాల రద్దీ కారణంగా భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కమిషనర్ ప్రస్తావించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం మార్గం కల్పిస్థామన్నారు కమిషనర్ చెప్పారు. అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విక్రయాల ఏర్పాట్లు చేయడంతో పాటు రైతు బజార్‌కు వచ్చే వినియోగదారుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. వ్యాపారులు తమ సరుకుల అన్‌లోడింగ్ కార్యకలాపాలను ఉదయం 7 గంటలలోపు పూర్తి చేసుకునే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ కెటి సుధాకర్, డీసీపీ కె కృష్ణారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# శోధన ఆగింది.. జాను ఏమైంది?!



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తుని నియోజకవర్గంలో ఈ నెల 2వ తేదీన ఇంటి నుంచి బయటకు వచ్చి కనిపించకుండా పోయిన 2 ఏళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి ఉరఫ్ జాను జాడ ఇప్పటికీ కనిపించలేదు. అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ బాలిక జాడ లభించలేదని అధికారులు ప్రకటించారు. పోలీసు, రెవెన్యూ , అటవీ, ఎన్‌డీఆర్ ఎఫ్(విపత్తు దళం) సహా.. స్థానిక అధికారులు, బంధుమిత్రులు కూడా అన్ని ప్రాంతాల్లో నూ గాలించారు. అయినా.. పాప జాడ తెలియరాలేదు. కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతం.. ఇలా.. ఎక్కడా ఇంచ్ కూడా వదల కుండా జాను కోసం వెతికారు. అయినా.. పాప జాడ తెలియలేదని అధికారులు తెలిపారు. ఒకానొక దశలో బొమ్మల్లో మాంసం కూరి.. అటవీ ప్రాంతంలో పెట్టారు. ఒకవేళ ఏవైనా జంతువులు.. పాపను ఎత్తుకుపోయి ఉంటే.. తిరిగి మాంసం కోసం వస్తాయన్న ఆలోచనతో ఈ ప్రయోగం చేశారు. అయినా.. ఇది కూడా ఫలించలేదు. మరోవైపు చిట్టడవుల్లో డ్రోన్లతోనూ పరిసరాలను జల్లెడ పట్టారు. ఇలా.. దాదాపు 20 రోజులకు పైగానే పాప జాడ కోసం ప్రయత్నించారు. కానీ, ఎక్కడా కనిపించలేదు. దీంతో తమ ప్రయత్నాలను విరమిస్తున్నట్టు జిల్లా ఎస్పీ ప్రకటించారు. అయితే.. కుట్ర కోణం లేదా.. అపహరణ కోణంలో మాత్రం దర్యాప్తు కొనసాగుతుందన్నారు. ఇదిలావుంటే.. ఇప్పటి వరకు దర్యాప్తు సాగడంతో తల్లిదండ్రులు పాప జాడ తెలుస్తుందని ఆశలు పెట్టుకున్నారు. కానీ, ఇప్పుడు వేట నిలిచిపోవడంతో వారు మరింత ఆవేదనకు గురయ్యారు.

**కోర్టుకు ఏం చెప్పాలి?**

ప్రస్తుత పరిస్థితులను యధాతథంగా కోర్టుకు విన్నవించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. అయితే.. శోధన నిలిచిపోయినా.. పోలీసులు తమ ప్రయత్నాలు మానవద్దని హోం శాఖ ఆదేశించింది. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే కాకుండా.. తండాలు, గిరిజనులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనూ మొబైల్ ఫోన్లకు పాప ఫొటోలను పంపించి.. వెతకాలని నిర్ణయించారు. అదేసమయంలో రాష్ట్రంలోని యాచక ముఠాలను కూడా విచారించాలని ఆదేశాలు వచ్చాయి. కొందరు యాచకులు.. చిన్నారులను అపహరించి పొరుగు రాష్ట్రాలకు విక్రయిస్తున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆ కోణంలో కూడా దర్యాప్తు చేయనున్నారు.

# ముద్రగడ ఆరోగ్యంగా తిరిగి రావాలి : తోట త్రిమూర్తులు

కాపు ఉద్యమ నేతగా ముద్రగడ పద్మనాభానికి ఎంతో పేరు ఉంది. ఆయన గతంలో అనేక సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు, ఎంపీగా చేశారు. మంత్రిగా కూడా పనిచేశారు. కానీ ముద్రగడ పేరు వింటే కాపు పోరాట నేతగానే అందరికీ గుర్తుకు వస్తారు. అంతలా ఒక సామాజిక వర్గం కోసం తపన పడిన వారు ఈ తరంలో ఎవరూ కనిపించరు. అంతే కాదు రాజకీయాలను సైతం పక్కన పెట్టి తన కెరీర్ ని కూడా వదిలేసి ముద్రగడ కులానికి కట్టుబడిపోయారు. ముద్రగడ రాజకీయ జీవితంలో ఎత్తు పల్లాలు ఉన్నట్లే ఆయన ఉద్యమ దశలోనూ ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తుగా ఉంటే ఆయన 2024 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. రెండేళ్ళుగా ఆయన పెద్దగా రాజకీయంగా యాక్టివ్ గా అయితే లేరు. ఆయన ఆరోగ్య సమస్యలు కూడా అందుకు మరో కారణంగా చెబుతున్నారు.

**విజ్ఞప్తి చేస్తున్నా అంటూ :** ఈ క్రమంలో వైసీపీ ఎమ్మెల్సీ సీనియర్ నేత తోట త్రిమూర్తులు అయితే మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముద్రగడని పట్టించుకోవడం లేదని వైసీపీ నేతలను టార్గెట్ చేస్తూ ఈ విషయంలో ఒక సెక్షన్ ఆఫ్ మీడియా దుష్ప్రచారం చేస్తోంది అని అన్నారు. వైసీపీ నేతల గురించి కూడా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని సోషల్ మీడియా వేదికగా ఇదే విధంగా ట్రోల్స్ చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఇది మంచి విధానం కాదని ఆయన అంటూ ఆ తరహా ప్రచారాలు చేయడం తప్పు అన్నారు. తామంతా ముద్రగడ వెంటనే ఉన్నామని చెప్పారు. ఆయన ఆరోగ్యం విషయంలో తాము కూడా ఫుల్ అలెర్ట్ గా ఉన్నామని ఎప్పటికప్పుడు అన్నీ తెలుసుకుంటున్నామని చెప్పారు.

**క్షేమంగా రావాలని :** ముద్రగడ నిజాయితీపరుడైన నేత అని సీఎం స్థాయి నాయకుడు అని తోట కొనియాడారు. ఆయన క్షేమంగా తిరిగి రావాలని అంతా కోరుకుంటున్నామని కూడా చెప్పారు. ఇంతకీ ముద్రగడకు ఏమైంది అన్న చర్చ అయితే సాగుతోంది. తోట త్రిమూర్తులు మీడియా ముఖంగా చేసిన విజ్ఞప్తి సంగతిని బట్టి చూస్తే ముద్రగడ ఆరోగ్యం విషయంలో మళ్లీ కొత్త ప్రచారానికి కూడా తావు ఇచ్చినట్లు అయింది అని అంటున్నారు. ఏడు పదులకు చేరువ అవుతున్న ముద్రగడ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఆయన క్షేమంగా తిరిగి రావాలని అంతా కోరుకుంటున్నారు.

# జెండా మోసిన ప్రతి కార్యకర్త ఎమ్మెల్యేతో సమానం

**తప్పు చేస్తే శిక్ష తప్పదు - శాంతి భద్రతల విషయంలో రాజీపడం**

**రౌడీషీటర్లపై ఉక్కుపాదం - మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపుతూ ప్రజలకు భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, వారికి సురక్షిత వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే పార్టీ కోసం జెండా మోసిన ప్రతి కార్యకర్త ఎమ్మెల్యేతో సమానమనే భావనతో పనిచేస్తున్నామని, కార్యకర్తల గౌరవం, ప్రజా సేవే తమ రాజకీయాల ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక 6, 31వ డివిజన్లకు సంబంధించి అన్నపూర్ణమ్మ పేటలో "మన వార్డులో - మన ఆదిరెడ్డి" కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) నిర్వహించారు. అధికారులతో సమీక్ష నిర్వహించి, తరువాత కూటమి కార్యకర్తలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014, 2019, 2024 ఎన్నికల్లో 6, 31వ డివిజన్ల ప్రజలు తెలుగుదేశం పార్టీ, అనంతరం కూటమిపై చూపిన విశ్వాసాన్ని గుర్తు చేశారు. ప్రజలు ఇచ్చిన భారీ మెజారిటీ తమ బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించిన ఆయన, "జెండా మోసిన ప్రతి కార్యకర్త ఎమ్మెల్యేతో సమానం... ప్రజల తరఫున వారు చెప్పే ప్రతి సమస్యకు అధికారులు గౌరవంగా స్పందించి పరిష్కారం చూపాలి" అని స్పష్టం చేశారు. మహిళల భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని హెచ్చరించారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యత స్వీకరించిన తర్వాత నగరంలో సుమారు 130 మందిపై రౌడీషీట్లు తెరవడం జరిగిందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద ఏడాది పాటు జైలుకు పంపించడానికైనా, తిరిగి నేరాలకు పాల్పడితే నగర బహిష్కరణ చర్యలు తీసుకోవడానికైనా ప్రభుత్వం వెనుకాడదన్నారు. మహిళలకు ఇబ్బంది కలిగించే ఘటనలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించారని విమర్శించిన ఎమ్మెల్యే వాసు ప్రస్తుతం ప్రతి అభివృద్ధి పనిని ప్రజలతో చర్చించి, వారి అవసరాలకు అనుగుణంగా చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వెల్లడిస్తూ, 6వ డివిజన్‌లో ఇప్పటికే రూ.3.52 కోట్ల విలువైన రోడ్లు, డ్రైనేజీలు, పుష్కర పనులు చేపట్టామని, 31వ డివిజన్‌లో రూ.4.30 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం లభించిందని చెప్పారు. రెండు డివిజన్లలో నాలుగు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా నగరానికి మూడు కొత్త సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని తెలిపారు. సంక్షేమం విషయంలో కూడా కూటమి ప్రభుత్వం వేగంగా పనిచేస్తోందని పేర్కొంటూ, నియోజకవర్గంలో ఇప్పటివరకు 722 కొత్త పెన్షన్లు, 8 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, సీఎస్‌ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ప్రభుత్వాసుపత్రులు, అర్బన్ హెల్త్ సెంటర్లను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కార్యకర్తలు సమన్వయంతో పనిచేసినప్పుడే కూటమి స్ఫూర్తి నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు అధ్యక్షతన, డివిజన్ ఇంచార్జ్ మజ్జి మణికంఠ సారథ్యంలో జరిగిన ఈ సమావేశంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కూటమి నాయకులు యర్రా వేణుగోపాల రాయుడు, వర్రే శ్రీనివాసరావు, అత్తి సత్యనారాయణ, బుడ్డిగ రవి తది తరులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్ర మాలను అభినందించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త నాలిపల్లి అప్పారావు నివాసంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రాత్రి బస చేశారు. ఈ కార్యక్రమంలో చింతా జోగినాయుడు, కిలపర్తి నాగభూషణం, సనపతి సత్తిబాబు, సురేంద్ర, శ్యామ్, రుంకాని విజయ్, జామి సత్యనారాయణతో పాటు తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ మట్టి ఇసుక తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలో అక్రమ మట్టిమాఫియా అక్రమార్కుల పై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా,రాజమండ్రి పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరికి వినతి పత్రం సమర్పించారు. గురువారం రాజమహేంద్ర వరంలో పలువురు వైకాపా నాయకులు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడబడితే అక్కడ,పర్యావరణానికి అటు ప్రజలకు ఇబ్బంది కలిగించేలా అక్రమ మట్టి,ఇసుక తవ్వకాలు యదేచ్ఛగా జరుగుతున్నాయన్నారు. అక్రమ మాఫియా పై రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తే, ఫిర్యాదుదారులపైనే పోలీసు తిరిగి కేసులు బనాయిస్తున్నారని,భౌతిక దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడుతూ నిసిగ్గుగా హత్యాయత్న కేసులు కూడా బనాయిస్తున్నారని జక్కంపూడి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.తక్షణం మట్టి మాఫియా అక్రమార్కులపై కట్టిన చర్యలు తీసుకోవాలని, ప్రజాదాయాన్ని కొల్లగొట్టే పరిస్థితులను నివారించి, ప్రజల ప్రాణాల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కీర్తికి ఫిర్యాదుతో పాటు పలు ఘటనపై సాక్షాధారాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

**వైకాపా నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు**



## ఎస్ఐఆర్‌కు రాజకీయ పార్టీలు సహకరించాలి : కమిషనర్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం అర్బన్‌లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శ కంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పని చేయాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్ లో ఎస్ఐఆర్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ కార్యక్రమం కోసం యంత్రాంగం సన్నద్ధంగా ఉందని, దీనికి రాజకీయ పార్టీల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమని.. ఈ ప్రక్రియ విజయవంతం కావడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ సహకరించాలని కోరారు. ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో నియమించిన బీఎల్‌ఏలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై అన్ని వార్డులలో అవగాహన క్యాంపులు, మైక్ అనౌన్స్ మెంట్లు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలోని 241 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,65,721 మంది ఓటర్లు ఉన్నట్లు కమిషనర్ వెల్లడించారు. శాశ్వతంగా వలస వెళ్లిన, మరణించిన, డూప్లికేట్ ఓటర్లను జాబితా నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. అలాగే నగరంలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా.. ఇంటింటి సర్వే సమయంలో బీఎల్‌వోలకు బీఎల్‌ఏలు సహకరించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, ఎమ్మార్వో రంజిత్ కుమార్, ఇతర అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరుక్మిణి సత్యభామ సమేత

## వేణుగోపాలస్వామి వార్షిక మహోత్సవం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండల కేంద్రంలో శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆయలంలో స్వామి వారి వార్షిక మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో ఆధ్యాత్మిక ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఏఇ సత్యనారాయణ తెలిపారు. ఈ ఉత్సవంలో కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వేద పండితుల నడుమ భాజా భజంత్రీలతో జరిగిన ఉత్సవ వేడుక అందర్నీ ఆకట్టుకుంది.

## సెప్టెంబర్ 4న శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సామూహిక ఉచిత వివాహాలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి ఆశీస్సులతో సెప్టెంబర్ 4వ తేదీన సామూహిక ఉచిత వివాహాలు నిర్వహించేందుకు కళ్యాణమస్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ట్రస్ట్ సభ్యులు, ఆలయ ధర్మకర్తలు ఒక ప్రకటనలో తెలిపారు.. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ క్షేత్రంలో లోక కళ్యాణార్థమై స్వామి సన్నిధిలో సంవత్సరములో ఒక్కసారి మాత్రమే వచ్చే బ్రహ్మ ముహూర్తంలో ఉచిత వివాహాలు జరిగించేందుకు స్వామి అనుగ్రహంతో నిర్ణ యించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన నూతన వధూవరులు సద్వినియోగపరచుకొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. వివాహం చేసుకునే వధూవరులకు ఉచితంగా బంగారు మంగళసూత్రములు, వెండి మట్టెలు, పెండ్లి వస్త్రాలు, తలంబ్రాలతో సహా పెళ్లి సామాగ్రి, స్వామి వారి అన్న ప్రసాదములను ఆలయ ఆధ్వర్యంలో అందజేస్తామని తెలిపారు. వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. అవసరమైన వారు 0883-2447979,7382357979 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణను

# ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**కుడుపూడి సత్తిబాబు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎలక్షన్ కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు స్థానిక రాజేందర్ నగర్‌లోని 128, 129 పోలింగ్ బూత్ ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల అందచేసి నింపడం, సబ్మిట్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసి ఎన్యుమరేషన్ ఫారాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# సంయుక్త సోషల్ సర్వీస్ వృద్ధ ఆశ్రమ సేవలు ప్రారంభం

**దాతలు సహకారంతో మా సేవలు మరింత విస్తరింపజేస్తాం**

**ఆర్గనైజర్ డాక్టర్ చల్లా ఉదయ సంగీత పిలుపు**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నిరాదరణకు గురైన వృద్ధులను, వికలాంగుల ను, అందుకోవాలని సంయుక్త సోషల్ సర్వీస్ ఆర్గనైజర్ డాక్టర్ చల్లా ఉదయ సంగీత పేర్కొన్నారు. గురువారం రాజమండ్రి క్వారీ మార్కెట్, డీ మార్ట్ ఎదురుగా సంయుక్త సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో నిరాశ్రయులైన వృద్ధులకు వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 300 మంది వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం 200 మందికి దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చల్లా ఉదయ సంగీత మాట్లాడితూ గత 10 సంవత్సరాలుగా నిరాశ్రయులైన అనాథ వృద్ధులకు ,లెప్రసీ వ్యాధిగ్రస్తులకు, మానసిక వికలాంగులకు కు దాతల సహకారంతో భోజన వసతి కల్పిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు శాశ్వత వృద్ధాశ్రమం ఏర్పాటు చేయ్యాలనే లక్ష్యం తో సంయుక్త సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో క్వారీ మార్కెట్,ఢీ మార్ట్ ఎదురుగా ఆశ్రమాన్ని ప్రారంభించారు. గత 10 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని వివరించారు. ప్రస్తుతం సమాజంలో వృద్ధులు నిరాధరణ కు గురవుతున్నారని, తల్లిదండ్రులను వారి కడుపున పుట్టిన బిడ్డలే రోడ్డుపై వదిలేస్తున్నారని ఇలాంటి వారిని ఒక చోటికి చేర్చి వారికి ఆదరణ కల్పించడమే సంయుక్త సోషల్ సర్వీస్ లక్ష్యమని అన్నారు. ఆకలితో ఉన్న అనాథలను, వికలాంగుల ను అక్కున చేర్చుకుని వారి అవసరాలు తీర్చి వృద్ధాప్యంలో వారు సుఖంగా జీవించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సంయుక్త సోషల్ సర్వీసెస్ కుటుంబ సభ్యులు స్పాన్సర్స్ అందరూ కలిపి, ఎప్పటిలాగే ఈ ఆశ్రమాన్ని కూడా ఆదరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చల్లా ఉదయ సంగీత, దట్టపు కల్పనా, వుబా భారతి ,సాక్షి పోలవరపు ,జల రాణి , అనిత దిడ్డి శ్రీను , వుబా రవి కుమార్ కడగల లక్ష్మణ్ , కడగల రవితేజ , ద్వారా జగదీశ్, కుమార్ ,అజయ్ , వినయ్ ,తదితరులు పాల్గొన్నారు.నేటి దాతలు కాంతం ఆనంద్ కుమార్ (సీమాన్)15 కుర్చిలు , వుబా భారతి (గ్లాసులు, ఆకులు )హైమ, రైస్ బస్తాలు 2, ఎం. శాంతి రైస్ బస్తా 1, నీరజ రైస్ బస్తా 1, ప్రవల్లిక రైస్ బస్తా 1, తెరపల్లి శ్రీను రైస్ బస్తా 1 బహూకరించారు. సంయుక్త సోషల్ సర్వీస్ అనాథ ఆశ్రమానికి విరాళాలు ఇచ్చే దాతలు డాక్టర్ చల్లా ఉదయ సంగీత ఫోన్ నెంబర్ : 73962 67772, 86881 53369లలో సంప్రదించాలని ఆమె కోరారు.

కృష్ణాలయ ఆలయ నిర్మాణానికి 50వేల రూపాయల

# విరాళం అందించిన సిపిఐ ఎంఎల్ పార్టీ పలివెల



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతా నగరం మండలంలో లంకూరు గ్రామంలో గొల్లల ర్యాంప్ సమీపం నందు నూతనంగా నిర్మించబడుతున్న కృషాలయ ఆలయ నిర్మాణానికి సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు 50 వేల రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు వంటపాటి సూరిబాబుకు చెక్కు రూపంలో అందించారు. రాబోయే కృష్ణాష్టమికి ఆలయ ప్రతిష్ట ఉంటుందని ఆలయ కమిటీ తెలిపారు. ఆలయ నిర్మాణాలకు దాతృత్వాన్ని చాటుతున్న పలివెల వీరబాబుకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాలకు విరాళాలను అందిస్తూ మండల ప్రజల హృదయాల్లో పలివెల నిలిచిపోతున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ పార్టీ మండల అధ్యక్షుడు నందమూరి చిట్టి స్వామి,మండల మహిళా అధ్యక్షురాలు తవిటికి సునీత,నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పలివెల జ్యోతి,కొవ్వూరి ఆదిరెడ్డి,గొలుగూరి నవీన్ రెడ్డి,ద్వారంపూడి స్వామి కుమార్ రెడ్డి,కృష్ణాలయ ఆలయ కమిటీ అధ్యక్షుడు వంటపాటి సూరిబాబు, కూరాకుల వెంకటమంగ,వంటపాటి విజయ దుర్గ,మాగాపు పావని,గొంగుల లక్ష్మి,చిట్టి మేని రాజు,వంటపాటి గన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సరఫరాకు నేడు (శుక్రవారం)అంతరాయం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ప్రధాన మంచినీటి సరఫరా విభాగంలో పుష్కర్ ఘాట్ వద్ద పైపు లైన్ మరమ్మత్తుల నేపథ్యంలో 1 నుంచి 7 వార్డులు(1, 2, 3, 4, 5, 6, 7), 43 నుంచి 50 వార్డులలో (43, 44, 45, 46, 47, 48, 49, 50) నీటి సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ రీటా ఓ ప్రకటనలో తెలిపారు. దీని వల్ల ఆయా ప్రాంతాలకు నేటి (గురువారం) సాయంత్రం, శుక్రవారం త్రాగునీరు సరఫరా కాదని వెల్లడించారు. తిరిగి 27 న యధావిధిగా నీటి సరఫరా పునఃప్రారంభించబడుతుందని పేర్కొన్నారు. అంతవరకు సదరు ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అందించబడుతుందని తెలిపారు. ప్రజలందరూ గమనించి అవసరమైనంత నీటిని నిల్వ చేసుకోవలసిందిగా విజ్ఞప్తి చేశారు.వాటర్ ట్యాంకర్ల కోసం సంప్రదించవలసిన ఫోన్ నంబర్: అసిస్టెంట్ ఇంజనీర్, వాటర్ సప్లై - 9849908350.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

## ఇప్పటికీ నేను ఆ జబ్బుతో
# ఫైట్ చేస్తూనే ఉన్నాను..

### షాకింగ్ విషయం చెప్పిన సింగర్ సునీత



స్టార్ సింగర్ సునీత చాలా రోజుల తర్వాత ఓ ఇంటర్వ్యూకు హాజరైంది. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. ఇదే క్రమంలో మహిళల డ్రెస్సింగ్ స్టైల్, ఇండస్ట్రీలోని క్యాస్టింగ్ కౌచ్ పై ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. స్టార్ సింగర్ సునీత ఇప్పుడు బిజీ బిజీగా ఉంటోంది. ఓ వైపు సినిమా పాటలు పాడుతూనే టీవీ షోస్, ఓటీటీ షోస్ లో సందడి చేస్తోంది. అలాగే ప్రైవేట్ ఈవెంట్స్, కాన్సర్ట్స్ నిర్వహిస్తోంది. ప్రైవేట్ ఆల్బమ్స్ చేస్తూ తీరిక లేకుండా ఉంటోందీ స్టార్ సింగర్. అయితే ఇంత బిజీ వర్క్ లోనూ ఓ యూట్యూబ్ ఛానెల్ కు ఇంటర్వ్యూ ఇచ్చింది సునీత. అది కూడా చాలా ఏళ్ల తర్వాత. ఈ ఇంటర్వ్యూలో సునీత పలు అంశాల గురించి మాట్లాడింది. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. అలాగే సినిమా ఇండస్ట్రీలని సమస్యలపై తన అభిప్రాయాలను పంచుకుంది. అయితే అమ్మాయిల వస్త్రధారణపై, క్యాస్టింగ్ కౌచ్ లపై సునీత చేసిన కామెంట్స్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారాయి. కాగా ఇదే ఇంటర్వ్యూలో తన ఆరోగ్యం గురించి ఓపెన్ గా మాట్లాడింది సునీత. చాలా ఏళ్లుగా తాను ఓ వ్యాధితో బాధపడుతున్నట్టు తెలిపి అందరికీ షాక్ ఇచ్చిందీ స్టార్ సింగర్. 'నేను చాలా ఏళ్లుగా క్రాన్స్ అనే వ్యాధితో బాధపడుతున్నాను. నా జీవితంలో చోటు చేసుకున్న కొన్ని సంఘటనలు, వ్యక్తిగత ఇబ్బందుల వల్ల నేను చాలా ఏళ్ల పాటు డిప్రెషన్ లో ఉండిపోయా. ఆ బాధ తాలూకు ఎఫెక్ట్ నే ఈ క్రాన్స్ అనే ఆటో ఇమ్యూన్ డిసీజ్. ఇది ప్రేగులకు సంబంధించిన అరుదైన వ్యాధి. ఇప్పటికీ నేను ఈ జబ్బుతో ఫైట్ చేస్తున్నాను. కొంచెం ఒత్తిడి పెరిగినా శరీరం అంతా విపరీతమైన నొప్పులు వస్తాయి' అని సింగర్ సునీత చెప్పుకొచ్చింది.

**అసలు ఏంటీ క్రాన్స్ వ్యాధి ?**

క్రాన్స అనేది దీర్ఘకాలిక ప్రేగు వ్యాధి. దీని బారిన పడితే నోటి నుంచి పాయువు వరకు ఎక్కడైనా వాపు, చికాకు కలుగుతాయి. ఈ వ్యాధి వల్ల.. జీర్ణ సంబంధిత సమస్యల ఎక్కువగా వస్తాయి. అంటే విరేచనాలు, కడుపు నొప్పి, ఉబ్బరం, అలసట, జ్వరం, ఆకలి తగ్గడం.. ఇలా ప్రేగులకు సంబంధించిన సమస్యలు ఎదురవుతాయి. ఈ వ్యాధికి పూర్తి నివారణ లేకపోయినా సరైన ట్రీట్మెంట్, జీవన శైలిలో మార్పులు చేసుకుంటే ఈ వ్యాధి లక్షణాలను అదుపులో ఉంచుకోవచ్చని తెలుస్తోంది.

# రష్మికలా నేను చేయలేను..

### నేషనల్ క్రష్‌పై టాలీవుడ్ హీరోయిన్ కామెంట్స్ వైరల్



రష్మిక మందన్నా సక్సెస్ కేవలం అదృష్టం కాదని, అది ఆమె అపారమైన కృషి, విశిష్టమైన ప్రతిభకు నిదర్శనమని ఈ స్టార్ హీరోయిన్ ప్రశంసలు కురిపించింది. ముఖ్యంగా ఆమె డ్యాన్సింగ్ స్కిల్స్ సూపర్బ్ అంటూ అందరూ రష్మిక మందన్నా కాలేరని నేషనల్ క్రష్ కు కితాబిచ్చిందీ ముద్దుగుమ్మ. సినిమా ఇండస్ట్రీలో రష్మిక మందన్న ఎదుగుదలను చూసి చాలామంది దానిని కేవలం 'అదృష్టం' అని అంటుంటారు. అయితే, ఈ రోజు రష్మిక ఈ స్థాయికి ఎదగడం వెనుక ఆమె స్వయం కృషి ఉంది. సినిమా ఇండస్ట్రీలో ఆమె కృషిని, నటనను గుర్తించి, గౌరవించేవారు చాలా మంది ఉన్నారు. తాజాగా ప్రముఖ దక్షిణాది నటి ఐశ్వర్య లక్ష్మి కూడా అదే జాబితాలో చేరింది. ఓ ఇంటర్వ్యూలో ఆమె రష్మిక గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరలవుతున్నాయి. "ప్రతి ఒక్కరూ రష్మిక మందన్నలా ఉండలేరు. రష్మిక చేసేది నేను ఖచ్చితంగా చేయలేను. ఆమె సినిమాల్లో చాలా అద్భుతంగా నటిస్తుంది. ఆమె తన అందం, అభినయంతో వెండి తెరపై మాయం చేస్తోంది. రష్మిక చాలా కమర్షియల్ చిత్రాలు చేసింది, అలాగే విభిన్న పాత్రలలో కూడా నటించింది. అన్నింటికన్నా ముఖ్యంగా, నేను రష్మిక అంత ఉత్సాహంగా డ్యాన్స్ చేయలేను' అని చెప్పుకొచ్చింది రష్మిక మందన్నా. ఐశ్వర్య లక్ష్మి మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రష్మిక కేవలం అదృష్టంతో అగ్రస్థానానికి రాలేదని, తన కఠోర శ్రమతో ఈ స్థానాన్ని సాధించిందని చెప్పడానికి ఈ మాటలే నిదర్శనమని అభిమానులు కామెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం నేషనల్ క్రష్ రష్మిక మందన్న వరుస పెద్ద సినిమాలతో బిజీ బిజీగా ఉంటోంది. కేవలం దక్షిణాదిలోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా తనకంటూ ఒక భారీ మార్కెట్‌ను సృష్టించుకుందీ అందాల తార. రష్మిక మందన్న రాబోయే సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం 'మైసా' అనే ఓ లేడీ ఓరియంటెడ్ సినిమాలో నటిస్తోందీ ముద్దుగుమ్మ. ఈ సినిమా పోస్టర్లు, టీజర్స్ అందరి దృష్టిని ఆకర్షించాయి. దీంతో పాటు తన భర్త విజయ్ దేవరకొండతో కలిస రణబాలి అనే సినిమాలో నటిస్తోంది రష్మిక. గతంలో విజయ్ తో ట్యాక్సీవాలా వంటి సూపర్ హిట్ సినిమాను తీసిన రాహుల్ సాంకృత్యాన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ రెండు సినిమాలు త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఇక ఐశ్వర్య లక్ష్మీ విషయానికి వస్తే.. తమిళ హీరోయినే అయినా తెలుగులోనూ మంచి క్రేజ్ సొంతం చేసుకుందీ అందాల తార. ముఖ్యంగా ఆమె నటించిన మట్టి కుస్తీ సినిమా తెలుగు ప్రేక్షకులకు తెగ నచ్చేసింది. ఇప్పుడీ సినిమాకు సీక్వెల్ కూడా రాబోతుంది. దీంతో పాటు సాయి ధరమ్ తేజ్ హీరోగా నటిస్తోన్నసంబరాల ఏటి గట్టు సినిమాలోనూ హీరోయిన్ గా నటిస్తోంది ఐశ్వర్య.

# హైదరాబాద్ కెప్టెన్ అభిరథ్‌కే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్



టీజీ20 లీగ్‌లో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్‌కు వరుసగా రెండో విజయం వరించింది. రంగారెడ్డి రైజర్స్‌పై ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. కెప్టెన్ అభిరథ్ రెడ్డి (99: 45 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సులు) సూపర్ ఇన్నింగ్స్‌తో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రంగారెడ్డి 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో హైదరాబాద్ 18 ఓవర్లలోనే 4 వికెట్లను మాత్రమే కోల్పోయి గెలిచింది. అభిరథ్‌తోపాటు షణ్ముఖ (30: 18 బంతుల్లో 3 సిక్సులు), గడుగు గణేశ్ (25లి), యశ్వీర్ గౌడ్ (30లి: 13 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు) విలువైన పరుగులు చేశారు. రంగారెడ్డి బౌలర్లలో పున్నయ్య, తనయ్, ఆర్యన్, అరుణ్ తలో వికెట్ తీశారు. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో హైదరాబాద్ అగ్రస్థానానికి చేరుకుంది.

**ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్: అభిరథ్ రెడ్డి**
**గేమ్ ఛేంజర్ ఆఫ్ ది మ్యాచ్: యశ్వీర్ గౌడ్**

కెప్టెన్ అభిరథ్ ఔటైన తర్వాత.. క్రీజ్‌లోకి వచ్చిన యశ్వీర్ గౌడ్ (19లి) హ్యాట్రిక్ సిక్సులతో దంచేశాడు. దీంతో హైదరాబాద్ విజయ సమీకరణం తేలికగా మారిపోయింది. ప్రస్తుతం హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ స్కోరు 16 ఓవర్లకు 175/4. క్రీజ్‌లో యశ్వీర్‌తోపాటు గణేశ్ (14లి) ఉన్నారు. హైదరాబాద్ విజయానికి ఇంకా 24 బంతుల్లో 21 పరుగులు అవసరం.

హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ కెప్టెన్ అభిరథ్ రెడ్డి త్రుటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. కేవలం 45 బంతుల్లో 99 పరుగులు చేసిన అతడు.. భారీ షాట్‌కు యత్నించి పెవిలియన్‌కు చేరాడు. దీంతో ఒక్క పరుగు తేడాతో శతకం చేజారింది.

హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ మూడు వికెట్లను కోల్పోయింది. కేవలం 18 బంతుల్లోనే 30 పరుగులు చేసిన షణ్ముఖను అరుణ్ కుమార్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో 98 పరుగుల వద్ద మూడో వికెట్‌ను నష్టపోయింది. ప్రస్తుతం హైదరాబాద్ స్కోరు 13 ఓవర్లకు 124/3. క్రీజ్‌లో అభిరథ్ (72లి), గణేశ్ (10లి) ఉన్నారు. హైదరాబాద్ విజయానికి 42 బంతుల్లో 72 పరుగులు అవసరం.

రంగారెడ్డి రైజర్స్‌తో మ్యాచ్‌లో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ కెప్టెన్ అభిరథ్ రెడ్డి హాఫ్ సెంచరీ సాధించాడు. కేవలం 24 బంతుల్లోనే అభిరథ్ అర్ధ శతకం పూర్తి చేశాడు. ప్రస్తుతం హైదరాబాద్ స్కోరు 9 ఓవర్లకు 94/2. క్రీజ్‌లో అభిరథ్ (55లి), షణ్ముఖ (28లి) ఉన్నారు. హైదరాబాద్ విజయానికి ఇంకా 66 బంతుల్లో 102 పరుగులు అవసరం. రంగారెడ్డి రైజర్స్ స్కోరు 195/4.

రంగారెడ్డి రైజర్స్ నిర్దేశించిన 196 పరుగుల లక్ష్య ఛేదనకు హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ బరిలోకి దిగింది. ఆరు ఓవర్లు ముగిసేసరికి రెండు వికెట్ల నష్టానికి 58 పరుగులు చేసింది. పవర్ ప్లేలో ఇన్నింగ్స్ నెమ్మదించకుండా కెప్టెన్ అభిరథ్ రెడ్డి (41లి) దూకుడు ప్రదర్శించాడు. ఓ వైపు వికెట్లు పడినా.. భారీ షాట్లు కొట్టాడు. క్రీజ్‌లో అతడితోపాటు షణ్ముఖ (8లి) ఉన్నారు.

అంతకుముందు మూడో ఓవర్‌లో వికాస్ రెడ్డి (3)ని పున్నయ్య ఎల్బీగా పెవిలియన్‌కు పంపాడు. వన్‌డౌన్ బ్యాటర్ అన్విత్ రెడ్డి (4) కూడా ఔటయ్యాడు. కరియప్ప వేసిన బంతిని అన్విత్ షాట్‌కు యత్నించాడు. అయితే, బ్యాట్‌కు కాస్త పైన తగలడంతో బంతి మిడాఫ్‌లోకి వెళ్లింది. అక్కడ రాకేశ్ అద్భుతంగా డైవింగ్ చేసి క్యాచ్‌ను అందుకొన్నాడు. హైదరాబాద్ విజయానికి 14 ఓవర్లలో 138 పరుగులు అవసరం.

తొలుత బ్యాటింగ్ చేసిన రంగారెడ్డి 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. అవనీశ్ (53), ఆదిత్య జవ్వాజి (58) హాఫ్ సెంచరీలు సాధించారు. ఆరోన్ జార్జ్ (35), తనయ్ త్యాగరాజన్ (31) విలువైన పరుగులు చేశారు. హైదరాబాద్ బౌలర్లలో ప్రణవ్ వర్మ 2.. షణ్ముఖ, అఖిల్ చెరో వికెట్ తీశారు.

# టీ20 కెప్టెన్సీ.. ఇన్‌స్టా బయో మార్చిన శ్రేయస్ అయ్యర్




ఐర్లాండ్‌తో రెండు టీ20 సిరీస్‌తో శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. ఈ క్రమంలో తన ఇన్‌స్టాగ్రామ్ బయోను మార్చడం ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. తన రెండో పుట్టిన తేదీ అంటూ అందులో మెన్షన్ చేయడం గమనార్హం. 1994 డిసెంబర్ 6న శ్రేయస్ అయ్యర్ జన్మించాడు. అయితే, క్రికెట్ కెరీర్ పరంగా తనకు గతేడాది డిసెంబర్ 25న రెండో లైఫ్ వచ్చినట్లు రాసుకొచ్చాడు. దీంతో సోషల్ మీడియాలో అతడి అభిమానులు కామెంట్లతో ముంచెత్తారు. "శ్రేయస్ అయ్యర్ 25.12.2025నాడు గాయం నుంచి కోలుకుని బ్యాట్‌ను అందుకొన్నాడు. ప్రాణం పోయే పరిస్థితి నుంచి బయటపడ్డాడు. ఇది కేవలం క్రికెట్‌లోకి పునరాగమనం చేసిన రోజే కాదు.. తన జీవితంలో కొత్త జీవితానికి నాంది పలికాడు. అందుకే అతడికి ఇది స్పెషల్. అక్కడ్నుంచి తన ప్రయాణం ఫ్రెష్‌గా మొదలుపెట్టాడు. క్రమశిక్షణతో చాలా కష్టపడ్డాడు" అని ఓ అభిమాని తన సోషల్ మీడియా ఖాతాలో రాసుకొచ్చాడు.

# పాలమూరు ఇన్నింగ్స్ పూర్తి..

### మెదక్ టార్గెట్ 165



టీజీ20 లీగ్‌లో భాగంగా పాలమూరు స్ట్రైకర్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో మెదక్ ఫాల్కన్స్ ఇన్నింగ్స్ ముగిసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన మెదక్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. వరుణ్ (36; 23 బంతుల్లో 4x6), విక్రమ్ నాయక్ (36; 33 బంతుల్లో 3x4, 1x6) కీలక ఇన్నింగ్స్ ఆడారు. సృంజిత్‌రెడ్డి (19), నమన్ అగర్వాల్ (21), అశ్విన్ రామ్ (12), రవి తేజ (13) ఫర్వాలేదనిపించారు. మెదక్ బౌలర్లలో రవి కిరణ్, రిషభ్ చెరో 2 వికెట్లు పడగొట్టగా.. మహ్మద్ అఫ్రిది, తేజ, రోహిత్ రాయుడు తలో వికెట్ తీశారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com